మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | మంగళవారం | 09-12-2025 | సంపుటి : 14 | సంచిక :183 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Tuesday | 09-12-2025 | Volume :14 | Issue:183 | Pages:8 | Cost : 3 |


విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
నమస్తే హైదరాబాద్
తెలుగు దిన పత్రికకు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం
Ph: 9912580066




# తొలిరోజే రికార్డు స్థాయిలో
# పెట్టుబడుల వెల్లువ

హైదరాబాద్, డిసెంబర్ 08 (నమస్తే హైదరాబాద్) : రాష్ట్ర ఖ్యాతిని ఘనంగా చాటేలా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా నిర్వహిస్తుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమిట్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అంతర్జాతీయ, ఆర్థిక సదస్సు కోసం దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు తరలివచ్చారు. రేపటి సమిట్ కోసం ఇంకా పెద్ద సంఖ్యలో ప్రముఖులు తరలి వస్తున్నారు. . భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఈ సమిట్ లో అంచనా కు మించి తెలంగాణ ప్రభుత్వం వివిధ కంపెనీలు, సంస్థలతో ఎంవోయులు చేసుకుంది. నేడు ఒక్క రోజే రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. ఒక్క పవర్ సెక్టార్ లోనే రెండు లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూ కుదిరింది. ఈ ఓ కీలక ఒప్పందం కుదిరింది. ఫ్యూచర్‌సిటీలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు గుజరాత్‌లోని వన్యప్రాణుల పునరావస కేంద్రం వంతారా యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వంతారా బృందం ఎంవోయూ కుదుర్చుకుంది. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రేపు ఐటీ , వినోదం సెక్టార్ లో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది. ఇవాళ (సోమవారం) జరిగిన సమ్మిట్ కు రెండు వందల మంది విదేశి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమ్మిట్ కు దేశ ,విదేశాల నుంచి నాలుగు వేల మంది హాజరవుతారని అంచనా. సోమవారం ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047కు సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలన్నదే తమ ఆశయమని ఆయన స్పష్టం చేశారు. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవా దాలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొ ందించడం ద్వారా భవిష్యత్తుకు రోడ్ మ్యాప్ వేశారని వివరించారు. అలాగే తాము సైతం తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలని అనుకు న్నామన్నారు.



## రామ్మోహన్ నాయుడికి ప్రధాని, హోం మంత్రి ఫోన్.



న్యూఢిల్లీ, డిసెంబర్ 08 (నమస్తే హైదరాబాద్) : ఇండిగో విమానాల వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు సోమవారం రాజ్యసభలో వివరణ ఇచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇండిగో వ్యవహారంలో రాజ్యసభలో రామ్మోహన్ నాయుడు ఇచ్చిన సమాధానంపై ప్రధాని మోదీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇండిగో అంశంలో ప్రయాణికులకు మేలు జరిగేలా.. సమయస్ఫూర్తితో చర్యలు తీసుకున్నారంటూ మంత్రి రామ్మోహన్ నాయుడిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఈ వ్యవహారంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వైపు నుంచి ఎలాంటి లోటు పాట్లు లేకుండా.. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి రామోహ్మాన్ నాయుడితో ప్రధాని మోదీ పేర్కొన్నట్లు సమాచారం. ఇది పూర్తిగా ఇండిగో యాజమాన్య వైఫల్యమని.. కానీ కొంత మంది తెలిసీ తెలియక చేస్తున్న విమర్శలను పట్టించు కోకుండా ముందుకు వెళ్లాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అలాగే హోంమంత్రి అమిత్ షా సైతం ఫోన్ చేసి పరిస్థితి ఆరా తీసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇండిగో వ్యవహా రంపై విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎప్పటికప్పుడు ప్రధాని కార్యాలయానికి సమాచారం పంపినట్లు సమాచారం.

## మల్లారెడ్డిపై మండిపడ్డ కవిత

డిసెంబర్ 08 (నమస్తే హైదరాబాద్) :ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మేడ్చల్‌లో పూలు, పాలు అమ్ముకొని వేల ఎకరాలు కబ్జా చేశారే తప్ప, గతంలో మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్యే గా ఉన్న మల్లారెడ్డి పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా నిన్న ఆమె మేడ్చల్ నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా జవహర్ నగర్ డంపింగ్‌యార్డును పరిశీలించిన కవిత, అనంతరం అంబేద్కర్‌నగర్‌లో బస్తీవాసులతో సమావేశమ య్యారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. మేడ్చ ల్‌లో

2లో



## ఫ్యూచర్ సిటీ ఆలోచన బాగుంది.. నాగార్జున కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, డిసెంబర్ 08 (నమస్తే హైదరాబాద్) : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఇవాళ (సోమవారం) నుంచి రెండు రోజులపాటు అత్యంత వైభవంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోంది. అయితే, గ్లోబల్ సమ్మిట్‌లో పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అక్కినేని నాగార్జున సమ్మిట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఒకే కారులో అక్కడికి వచ్చారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు భట్టి విక్రమార్క, నాగార్జున. అనంతరం మీడియాతో నాగార్జున మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. 50 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఉ ంటున్నామని.. ఇక్కడ వాతావరణం బాగుందని వ్యాఖ్యా నించారు. తెలం

2లో

## జపాన్ తీరంలో భారీ భూకంపం..



ఇంటర్నెట్ డెస్క్: జపాన్ ఉత్తర తీరంలో సోమవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.6 తీవ్రత నమోదయ్యింది. హక్కాయిడో ద్వీపంలోని తీరప్రాంత రాజధాని అమోరీకి సమీపంలో సముద్రం అడుగున 50 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు జపాన్ మెటియొరొలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. సునామీ అలర్ట్ కూడా జారీ చేసింది. సుమారు 3 మీటర్ల మేర అలలు తీరాన్ని తాకే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అక్కడి అణువిద్యుత్ కేంద్రాల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొ నేందుకు వీలుగా విద్యుత్ కేంద్రాల్లో తనిఖీలను ముమ్మరం చేశారుభూకంప కేంద్రానికి 1000 కిలోమీటర్ల పరిధి లోని తీర ప్రాంతాలకు సునామీ ముప్పు పొంచి ఉ ందని జపాన్ అధికారులు తెలిపారు. జపాన్‌తో పాటు రష్యాకు కూడా సునామీ ముప్పు ఉందని తెలిపా రు. జపాన్‌లోని హక్కాయిడో, ఆమోరీ, ఇవాటే ప్రిఫెక్చర్లకు సునామీ హెచ్చరి కలు జారీ అయ్యాయి. పలు భూఫల కాలు (టెక్టానిక్ ప్లేట్స్) కలిసే ప్రాంతంలో జపాన్ ఉ ండటంతో అక్కడ భూకంపాల ముప్పు ఎక్కువని నిపుణులు చెబుతు న్నారు. పసిఫిక్ ప్లేట్, ఫిలిప్పీన్ సీ ప్లేట్, యూరేసియన్ ప్లేట్, నార్త్ అమెరికన్ ప్లేట్ కలిసే ప్రాంతంలో జపాన్ ఉందని జియాలజిస్టులు వివరిస్తున్నారు. భూఫ లకాలు పరస్పరం ఢీకొనడం వల్ల భూకంపాలు సంభవిస్తుంటాయి. జపాన్ కు ఈ ముప్పు మరింత ఎక్కువ.

## కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై హరీష్ రావు సంచలన కామెంట్స్




హైదరాబాద్, డిసెంబర్ 08 (నమస్తే హైదరాబాద్) : రెండేళ్ళ కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రతి రోజు ప్రజా దర్బార్‌లో ప్రజలను కలుస్తా అన్నారని.. ఆ గొప్పలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జల్సాలకు, విందులకు పెళ్లిళ్లకు, సీఎల్పీ మీటింగ్‌లకు ప్రజా భవన్‌ను వాడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ పాలన అంటూ దుయ్యబట్టారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి ప్రజలకు వేదన, రోదన మిగిల్చారన్నారు. రేవంత్ పాలనలో

2లో


## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం చంద్రబాబు ఆసక్తికర ట్వీట్

హైదరాబాద్, డిసెంబర్ 08 (నమస్తే హైదరాబాద్) : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఇవాళ(సోమవారం) నుంచి రెండు రోజులపాటు అత్యంత వైభవంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోంది. అయితే, గత మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతి నివాసంలో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. తాను తప్పకుండా వస్తానని సీఎం చంద్ర బాబు చెప్పారని కోమటిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలోనే గ్లోబల్ సమ్మిట్ దృష్ట్యా ట్విట్టర్ వేదికగా పోస్టు పెట్టారు సీఎం చంద్రబాబు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సదస్సు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి, ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్షిస్తు న్నానని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.



2లో

## రేవంత్ కీలక వ్యాఖ్యలు




2లో

# రామ్మోహన్ నాయుడికి ప్రధాని, హోం మంత్రి ఫోన్.

నవంబర్ 1వ తేదీ నుంచి ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను అమలు చేస్తున్నట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు, డీజీసీఏకు ఇండిగో సమాచారం ఇచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే డిసెంబర్ 1వ తేదీ వరకు ఇండిగో కార్యకలాపాలు అన్నీ సజావుగానే సాగాయని సంబంధిత వర్గాలు వివరించాయి. కానీ డిసెంబర్ 3వ తేదీ నుంచి ఒకేసారి సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. దాంతో అంతా ఆశ్చర్యానికి గురైనట్లు వెల్లడించాయి. ఒకేసారి విమాన కార్యకలాపాల్లో సమస్య వచ్చిందని... ఇది పూర్తిగా యాజమాన్య తప్పిదమని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అదీకాక ఈ సమస్య ఉత్పన్నమైనప్పుడు ఇండిగో యాజమాన్యంలోని పలువురు కీలక వ్యక్తులు విదేశాల్లో ఉన్నారని అధికార వర్గాలు ఈ సందర్భంగా స్పష్టం చేశాయి. ప్రయాణీకులకు చుక్కలు చూపించిన ఇండిగోపై తప్పకుండా చర్యలు ఉంటాయని.. అయితే అంతకుముందు తీసుకోవాల్సిన అంశాలపై పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# ఫ్యూచర్ సిటీ ఆలోచన బాగుంది.. నాగార్జున కీలక వ్యాఖ్యలు

గాణలో అన్నపూర్ణ స్టూడి యో ఉందని.. ఫ్యూచర్ సిటీలో మరో స్టూడియో నిర్మాణానికి బాలీవుడ్ ప్రముఖులు కలిసి ముందుకు రావడం మంచి పరిణామమని చెప్పుకొచ్చారు. అందరూ కలిసి వస్తే ప్రపంచ వ్యాప్త ఫెసిలిటీస్‌తో పెద్ద నిర్మాణం చేయవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ఫ్యూచర్ సిటీ ఆలోచన బాగుందని నటుడు నాగార్జున ప్రశంసించారు.

కాగా, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. మధ్యాహ్నం1:30లకు ఈ సదస్సును ప్రారంభించారు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. మధ్యాహ్నం 2:30కు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సమ్మిట్ వేదిక దగ్గర స్టాళ్లను పరిశీలించారు సీఎం. ఈ సదస్సులో నోబెల్ గ్రహీతలు బెనర్జీ, కైలాశ్ ప్రసంగాలు ఉండనున్నాయి. ఈ సదస్సుకు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ సదస్సు జరగుతోంది. వివిధ రంగాల ప్రతినిధుల బృందాలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు. ఈ సదస్సు ప్రాంగణంలో తెలంగాణ తల్లి డిజిటల్ విగ్రహం ఆవిష్కరించారు. సీఎం వెంట మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఈ సదస్సుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, నటుడు నాగార్జున హాజరయ్యారు. ఈ సమ్మిట్‌లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు జరగనున్నాయి.

# కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై హరీష్ రావు సంచలన కామెంట్స్


హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఆదాయం ఎందుకు తగ్గిందో చూసుకోవాలన్నారు. ఆర్గనైజ్డ్ కరప్షన్ పాలన రేవంత్ కుటుంబం, మంత్రులది అంటూ కామెంట్స్ చేశారు. కరప్షన్ ఎలా చేయాలో కాంగ్రెస్ పాలన చూసి నేర్చుకోవాలంటూ ఎద్దేవా చేశారు. వ్యవస్థీకృత అవినీతికి కాంగ్రెస్ అధిష్టానం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన ప్రజలకు మొండి చేయి చూపించిందని... అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం విజన్, విధానం ఏంటో ఎవరికి ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి, సంక్షేమం ఏమీ చేయలేదని మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. విజయోత్సవాలు కాదు.. అప జయోత్సవాలు జరుపుకోవాలన్నారు. బిల్లులు అడిగితే విజిలెన్స్ విచారణ, ఏసీబీ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై పగబట్టి.. బ్లాక్ మెయిల్ పాలన చేస్తున్నారన్నారు. ఒక్క ఊరిలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని తెలిపారు. మొత్తం రుణమాఫీ అయ్యిందంటే తాను రాజీనామాకు సిద్ధం.. మీరు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ రైతు సంక్షోభ ప్రభుత్వమన్నారు. జాబ్ నోటిఫికేషన్ ఇవ్వలేదు కానీ.. మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. తాగుబోతుల తెలంగాణ వైపు రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా పెద్ద కాంట్రాక్టర్ల బిల్స్ క్లియర్ అవుతున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు కామెంట్స్ చేశారు.

# మల్లారెడ్డిపై మండిపడ్డ కవిత

అభివృద్ధి జరిగిందని మల్లారెడ్డి చెబుతు న్నా, వాస్తవ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. తన పర్యటనలో తాగునీరు, రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని గుర్తించానని తెలిపారు. నియోజకవర్గంలో సరైన డిగ్రీ, జూనియర్ కళాశాలలు లేకపోవడంతో యువత ఉన్నత చదువులకు దూరమై గంజాయి వంటి వ్యసనాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జీవో నం.58, 59 కింద భూముల క్రమబద్ధీకరణ పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేసి ఏళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయలేదని కవిత ఆరోపించారు.

## నూతనంగా రానున్న నాలుగు కొత్త కార్మిక చట్టాలు

కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నాలుగు కొత్త కార్మిక చట్టాలు (లేబర్ కోడ్స్) ఉద్యోగుల వేతన స్వరూపాన్ని పూర్తిగా మార్చనున్నాయి. దేశంలోని 29 పాత కార్మిక చట్టాల స్థానంలో అమల్లోకి రానున్న ఈ కొత్త విధానం వల్ల నెలనెలా చేతికొచ్చే జీతం (టేక్ హోమ్ శాలరీ) తగ్గనుండగా, పదవీ విరమణ ప్రయోజనాలు గణనీయంగా పెరగనున్నాయి. నవంబర్ 21 నుంచే లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. కొత్త కార్మిక చట్టాల ప్రకారం, ఉద్యోగి మొత్తం వేతనంలో అలవెన్సులు 50 శాతానికి మించకూడదు. అంటే, బేసిక్ పే (మూల వేతనం), కరవు భత్యం (డీఏ) వంటివి కలిపి కనీసం 50 శాతం ఉండాలి. ప్రస్తుతం చాలా కంపెనీలు బేసిక్ పేను తక్కువగా చూపి, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులను ఎక్కువగా ఇస్తున్నాయి. కొత్త నిబంధనతో ఈ విధానానికి తెరపడనుంది.




# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం చంద్రబాబు ఆసక్తికర ట్వీట్

కాగా, హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండు రోజుల పాటు ఘనంగా జరగనుంది. ఇందుకోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గ్లోబల్ సమ్మిట్‌ను ఇవాళ మధ్యాహ్నం 1:30లకు ప్రారంభించనున్నారు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. మధ్యాహ్నం 2:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి గ్లోబల్ సమ్మిట్‌పై ప్రసంగించనున్నారు.

ఈ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది అతిథులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానించింది. గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు జరగనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు ఆరు వేలమంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ గేటు నుంచి సమ్మిట్ వేదిక వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేస్తున్నారు. అతిథుల భద్రత దృష్ట్యా పోలీసులు ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టారు. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణకు ఎంతో విలువైన పెట్టుబడులు వస్తాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది.

# రేవంత్ కీలక వ్యాఖ్యలు

సోనియా, మన్మోహన్ సారథ్యంలో తెలంగాణ కల సాకారం అవుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్‌లో సోమవారం గ్రాండ్‌గా ప్రారంభమవ్వగా.. సీఎం రేవంత్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమకు మహాత్మాగాంధీ, అంబేద్కర్ స్ఫూర్తి అని, అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతోందని అన్నారు. 2047 నాటికి కొత్త లక్ష్యాలు నిర్దేశించుకున్నామన్న ఆయన.. ఆర్థిక వేత్తల అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాట్లు చెప్పారు. విజన్ డాక్యుమెంట్‌కు సహకరించినవారికి ధన్యవాదాలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించి భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ వేశారని, తాము కూడా తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నట్లు చెప్పారు. వచ్చే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నట్లు రేవంత్ తెలిపారు.

"దేశానికి స్వాతంత్రం సిద్ధించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న 2047 నాటికి మనమేం సాధించగమో చెప్పాలని నిపుణులను కోరా.ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు బీజం పడింది. మనమేదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం%ౌ% ప్రజల మద్దతు కోరుతాం. భవిష్యత్తు కోసం మన కలలను నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నాం. తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. మంచి సానుకూల వాతావరణం ఉంది. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు 5% వాటాను అందిస్తున్నాం. 2047 నాటికి భారతదేశ %+ఞూ%లో 10% వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది మా లక్ష్యం. సేవారంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం%ౌ% ఇలా తెలంగాణను స్పష్టమైన 3 భాగాలుగా విభజించాం. మూడు భాగాలుగా విభజించి ప్రాంతాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్న రాష్ట్రాల్లో దేశంలోనే తెలంగాణ మొట్టమొదటి రాష్ట్రం" అని రేవంత్ పేర్కొన్నారు.

"చైనాలోని గ్వాంగ్-డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధి గురించి ప్రస్తావించదలచుకున్నా. గ్వాంగ్‌డాంగ్ ఆర్థిక వ్యవస్థ చైనాలోని ఏ ప్రావిన్స్‌కైనా అతిపెద్దది. 20 సంవత్సరాల్లో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులను, వృద్ధి రేటును సాధించారు. తెలంగాణలో కూడా మేము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నాం. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి మేమెంతో ప్రేరణ పొందాం. ఇప్పుడు మేం ఆ దేశాలతో పోటీ పడాలనుకుంటున్నాం. ఈ విజన్ కష్టంగా అనిపించవచ్చు%ౌ% కానీ ఆ విజన్ ను సాధించగలం. ఈ విషయంలో మా టీమ్ కు నేను చెప్పేదొక్కటే.. కష్టంగా ఉంటే, వెంటనే చేపడుదాం. అసాధ్యం అని అనుకుంటే.. వారికి కొంత గడువు ఇస్తా. ఇవాళ నేను నిన్నటి కంటే ఎక్కువ విశ్వాసంతో, నమ్మకంతో ఉన్నా. నిన్నటిది ఒక కల, ఒక ప్రణాళిక%ౌ%ఇవాళ మీరందరూ మాతో చేరారు. ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలని ఆశిస్తున్నాం. మీ అందరి మద్దతుతో తెలంగాణ రైజింగ్ లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా నమ్ముతున్నా. తెలంగాణ రైజింగ్ నిరంతర ప్రక్రియ" అని రేవంత్ తెలిపారు.


# ఎండోమెంట్స్ కాలనీలో లో పర్యటించి సమస్యలు పరిష్కరించిన కార్పొరేటర్ బండారు శ్రీ వాణి వెంకట్రావు




**ఉప్పల్, డిసెంబర్ 8 ( నమస్తే హైదరాబాద్):** రామంతపూర్ డివిజన్‌లోని ఎండోమెంట్స్ కాలనీ లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు అధికారులతో కలిసి సోమవారం పర్యటించి సమస్యలు పరిష్కరించారు. బస్తీవాసులు ఇటీవల కాలంలో లోప్రెజర్ కారణంగా మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదని, శానిటేషన్ సమస్యలు పెరుగుతున్నాయని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను గుర్తించిన కార్పొరేటర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖాధికారులను కాలనీకి పిలిపించి కాలనీలో పర్యటన నిర్వహించారు.

కాలనీలో శానిటేషన్ సమస్య తీవ్రంగా ఉండటాన్ని గుర్తించిన వెంటనే శానిటేషన్ సిబ్బందిని మొబిలైజ్ చేసి ఆ ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రపరిచేలా చర్యలు చేపట్టారు. కాలనీ ప్రజలు దీనిపై సంతృప్తి వ్యక్తం చేశారు.మంచినీటి లోప్రెజర్ సమస్యపై అధికారులు సాంకేతిక లోపం కారణంగా తాత్కాలిక అంతరాయం ఏర్పడిందని, మంగళవారం నుండి వచ్చే నీటి సప్లై నుంచే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని కార్పొరేటర్‌కు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ రవీందర్, శానిటేషన్ ఎస్ ఎఫ్ ఐ చంద్రకాంత్, బస్తీవాసులు ప్రభాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా చిల్లంచర్ల కృష్ణవేణి నియామకం



**హైదరాబాద్, డిసెంబర్ 8 ( నమస్తే హైదరాబాద్):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు తెలంగాణా రాష్ట్రానికి చెందిన చిల్లంచర్ల కృష్ణవేణి ని తెలంగాణ రాష్ట్ర కి వైస్ ప్రెసిడెంట్ గా నియమిస్తూ హెడ్ సంస్థ చైర్మన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేసే సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిల్లంచర్ల కృష్ణవేణి మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నన్ను రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా నియమించినందుకు చైర్మన్ మాధవ్, నా నియామకానికి కృషిచేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండ లకు ధన్యవాదాలు తెలియజేశారు. నా శక్తి మేరకు సంస్థ ఎదుగుదలకు కృషి చేస్తానని బాధితులకు అండదండగా ఉంటానని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం లభించే లాగా పోరాటం చేస్తానని పేర్కొన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించి మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. సంస్థ నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయడంతో పాటు వారి ఆదేశాల మేరకు అవసరమైన కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరపున మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. పదవి స్వీకరించిన సందర్భంగా సంస్థ సభ్యులు పుర ప్రముఖులు చిల్లంచర్ల కృష్ణవేణిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిల్కానగర్ డివిజన్ లో పెండింగ్ లో పనులకు ప్రతిపాదనలు తయారు చేయండి : కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

## -కార్పొరేటర్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం

**ఉప్పల్, డిసెంబర్ 8 ( నమస్తే హైదరాబాద్):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం తన కార్యాలయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో డివిజన్లోని పెండింగ్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.డివిజన్ లోని పెండింగ్ పనులకు నూతన ప్రతిపాదనలు తయారు చేయాలని, టెండర్ అయిన పనులకు ఇనాగ్రేషన్ అయిన వెంటనే కాంట్రాక్టర్లతో పనులు చేయించాలని, మంజూరైన నూతన పనులకు వెనువెంటనే ఇనాగ్రేషన్ కు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మల్లికార్జున్ నగర్ కాలనీ నుండి చిల్కానగర్ గుట్టపై నుంచి వచ్చే స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ అవుట్లెట్ పనులకు,ఆదర్శనగర్ మోడల్ గ్రేవీ యార్డ్ పనులను త్వరితగతిన పూర్తయ్యే విధంగా అన్ని చర్యలు,

చిల్కానగర్ చౌరస్తా వివేకానంద స్టాచ్యూ నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు 6 కోట్ల రూపాయలతోలి నిర్మించబోతున్న1000 యం. యం. (డయ) స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనుల శంకుస్థాపనకు అన్ని చర్యలు, పలు బస్తీల్లో కాలనీలో సిసి రోడ్లు స్ట్రామ్ వాటర్ డ్రమ్స్, కమ్యూనిటీ హాల్లో కొరకు నూతన ప్రతిపాదనలో జాప్యం జరగకుండా పూర్తిచేసి పంపాల్సిందిగా కోరడం జరిగింది.మల్లికార్జున్ నగర్ కాలనీలో నాచారం చెరువు నుండి వచ్చే ఓవర్ ఫ్లోర్ వాటర్ ట్రంక్ లైన్ పనులను పూర్తి చేయాలని అన్నారు. డివిజన్లో మిగిలిన ఉద్యానవనాల్లో ఓపెన్ జిమ్ లు, ఆట పరికరాలు



కు నూతన ప్రతిపాదనలు తయారు చేయాలని,డివిజన్లో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణం, ఉద్యానవనాల్లో జరుగుతున్న సివిల్ వర్క్ ని తప్పనిసరిగా పర్యవేక్షించాలని నాణ్యత లోపించకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీ.ఈ. వినీల్ గౌడ్, ఏ.ఈ. రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ పాల్గొన్నారు.

# ఇండిగోపై మూడీస్ ఆగ్రహం

భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దు కావడం ఇండిగోకు 'క్రెడిట్ నెగెటివ్'గా మారిందని ప్రముఖ రేటింగ్స్ సంస్థ మూడీస్ నివేదించింది. కొత్త విమానయాన నిబంధనలపై సరైన ప్రణాళిక లేకపోవడమే దీనికి కారణమని, దీనివల్ల ఇండిగోకు గణనీయమైన ఆర్థిక నష్టం వాటిల్లుతుందని వివరించింది. జరిమానాలు విధించే అవకాశం ఉందని మూడీస్ అభిప్రాయపడింది. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనలకు ఇండిగో సిద్ధం కాలేదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభదాయకతపై ప్రతికూల ప్రభావం ఉంటుందని వివిరించింది.



## ఉప్పల్ సెంట్ మటిల్డాస్ మోడల్ స్కూల్ లో శ్రీ సిరి మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్, ఎస్. వి. ఆర్ మెడికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం





**ఉప్పల్, డిసెంబర్ 8 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ శ్రీ సిరి మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్, స్వరూప్ నగర్ కాలనీ ఎస్ వి ఆర్ మెడికల్ సంయుక్త ఆధ్వర్యంలో సెంట్ మటిల్డాస్ మోడల్ స్కూల్, విజయపురి కాలనీ లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సౌజన్య పాల్గొని విద్యార్థులకు దంత సమస్యలు ఉన్న వారికి తగిన పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు దంత సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. దంత సమస్యలు తీవ్రమవ్వక ముందే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా బ్రష్ చేయడం, పళ్లపై ప్లాక్ ఏర్పడకుండా ఉండేలా మరియు ప్రతి 6 నెలలకు ఒకసారి క్లినిక్‌కి వచ్చి చెక్‌అప్ చేయించుకోవాలని, చిగుళ్ల వ్యాధి గురించి వివరంగా వివరించారు మరియు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జాన్సన్ జాన్ మాథ్యూ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థులు దంత పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సూచనలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంత చేసినందుకు స్కూల్ సిబ్బంది కి నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎన్నికల బ్యాలెట్ నమూనాతో గుడిలో పూజలు చేసిన సర్పంచ్ అభ్యర్థి అల్లం శృతి అరవింద్



**నమస్తే హైదరాబాద్ (బీబీనగర్):** యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం రహీం ఖాన్ గుడా గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి అల్లం శృతి అరవింద్ (నవ్య) మరియు వార్డు సభ్యులందరూ కలిసి ఎన్నికల బ్యాలెట్ నమూనా పత్రంతో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక పూజ నిర్వహించి, ప్రజలకు తమ గుర్తులను తెలియజేశారు. బి ఆర్ ఎస్ పార్టీ తరఫున శృతి అల్లం అరవిందులకు కత్తెర గుర్తు ఇవ్వడం జరిగింది. ఏడ వార్డు మెంబర్ ఎలిమినేటి శంకర్ రెడ్డికి గౌను గుర్తు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య



**ఘాట్ కేసర్ డిసెంబర్ 8 (నమస్తే హైదరాబాద్)** ఎల్బీనగర్ జోన్, ఘట్కేసర్ సర్కిల్లో, ఘట్కేసర్ బుగ్గనగర్ లో నివాసం ఉంటున్న సొట్ట అనిల్ కుమార్ (42) గత కొద్ది కాలంగా మధ్యానికి బానిసై, మద్యాన్ని మానుకోలేక మానసిక వేదనకు గురు చెందాడని, 8 డిసెంబర్ 2025 ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని వేలాడుతుండగా తన భార్య చూసి చుట్టుపక్కల వారి సహాయంతో గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు డాక్టర్లు ధ్రువకరించారు, భార్య సొట్ట మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీలు చేసిన సీఐ జానకిరాం రెడ్డి, ఎస్సై సృజన్ కుమార్





**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్) :** వరంగల్ సిపి ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పాలకుర్తి సీఐ జానకిరాం రెడ్డి,స్థానిక ఎస్సై సృజన్ కుమార్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సోమవారం వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాలకుర్తి సీఐ జానకిరాంరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు లేదా మద్యం రవాణా చేస్తూ దొరికితే సంబంధిత డబ్బులు లేదా మద్యం తక్షణమే సీజ్ చేయబడతాయి అని తెలిపారు. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహనాలపై పెండింగ్ ఉన్న చాలానాలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. టూవీలర్ నడిపే వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి వాహనం నడపరాదని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుంది : పీఏసి చైర్మన్,ఎమ్మెల్యే గాంధీ



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్ , భారతి నగర్(పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా మంజూరైన రూ.30,03,480/- ముప్పై లక్షల మూడు వేల నాలుగు వందల ఎనభై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని 30 మంది లబ్ధిదారులకు మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి చెక్కుల రూపేణా పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు సీఎం రేవంత్ రెడ్డి పెద్దన్నగా మారాడన్నారు. ఆడపిల్లల పెండ్లి కోసం తల్లిదండ్రులు అప్పులు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అందచేస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్,కాజా, ఖాసీం, లియకత్,శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ కార్యకర్తలు, మరియు లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒక్కరోజే రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం..



**గుజరాత్‌లోని జామ్ నగర్‌లో రిలయన్స్ సంస్థ వంతార పేరుతో అటవీ జంతువుల పరిరక్షణ కోసం అతిపెద్ద జూపార్క్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అలాంటి తరహా జూపార్క్ తెలంగాణలోనూ ఏర్పాటు చేయనున్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో దీనికి సంబంధించిన ఎంవోయూ జరిగింది.**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు భారీ స్పందన వస్తోంది. ఈ సదస్సులో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అందులో భాగంగా రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ నేతృత్వంలోని వంతారా బృందం కీలక ఎంవోయూ కదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో జూపార్క్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వంతో వంతారా డీల్ కుదుర్చుకుంది. సీఎం రేవంత్ సమక్షంలో అటవీశాఖతో వంతారా టీమ్ %మీాఖ% చేసుకుంది. గుజరాత్‌లోని వంతారాలో ఉండే సదుపాయాలన్నీ ఫ్యూచర్ సిటీలో ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఫ్యూచర్ సిటీలో ఈ కొత్త జూ పార్క్ ఏర్పాటు కానుండగా.. ఈ నెలాఖరున గుజరాత్‌లో ఉన్న వంతారాని సందర్శిస్తామని సీఎం రేవంత్ తెలిపారు.

విద్యుత్ శాఖలో భారీగా పెట్టుబడులు

మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో సోమవారం పలు ఒప్పందాలు జరిగాయి. తెలంగాణ విద్యుత్ శాఖలో ఒక్క రోజే రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకొచ్చాయి. భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ తొలిరోజు సదస్సు ప్రారంభోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు, వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ, విదేశాల నుంచి అతిరథ మహారథులు హాజరైన ఈ సదస్సులో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ భవిష్యత్తు కోసం నిర్దేశిత లక్ష్యాలను సవివరంగా ఆవిష్కరించారు.

మైహోమ్ రూ.7 వేల కోట్ల పెట్టుబడులు

ఇక ఈ గ్లోబల్ సమ్మిట్‌లో మైహోమ్ పవర్ సంస్థ క్హూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. మైహోమ్ పవర్ సంస్థ రూ.7 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటుంది. దీని వల్ల 12,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇంకా మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు చర్చలు జరుపుతున్నాయి.

కష్టంగా అనిపించినా సాధిస్తాం

"తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలు కొంత కష్టంగా అనిపించవచ్చు. కానీ వాటిని సాధించగలమన్న విశ్వాసం మాకుంది. ఈ విషయంలో మా బృందానికి చెబుతున్నదేమంటే.. కష్టంగా ఉంటే దాన్ని వెంటనే చేసి చూపిద్దాం. మీరది అసాధ్యమని భావిస్తే మరికొంత గడువిస్తాను. నిన్నటికంటే ఈరోజు నాలో మరింత నమ్మకం పెరిగింది. నిన్నటి రోజున అదొక కల, ఒక ప్రణాళిక. ఇప్పుడు మీరంతా మాకు మద్దతుగా నిలిచారు. దృఢసంకల్పంతో సాగిస్తున్న మా ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నాం. మీ అందరి మద్దతు, సహకారంతో లక్ష్యాలను సాధించగలం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్తు ప్రణాళికలతో సాగుతున్న తెలంగాణ రైజింగ్‌కు తిరుగులేదు. ఒక మంచి సంకల్పంతో వేసిన ఈ ముందడుగులో మా లక్ష్యాలను సాధించడానికి మీరంతా భాగస్వాములు కావాలని కోరుకుంటున్నా" అని రేవంత్ అన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌లో సంచలనం..

భారత ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్లోబల్ సమ్మిట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. తాజాగా ఈ సమ్మిట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యుత్ శాఖలో భారీ ఒప్పందాలు కుదిరాయి. ఇవాళ ఒక్కరోజే రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగింది. పంప్ స్టోరేజీ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూ జరిగింది. ఈ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభ ప్లీనరీలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొన్నారు.



# మళ్లీ కబ్జాదారుల నిర్మాణాలు.. రంగంలోకి హైడ్రా



తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ప్రభుత్వ స్థలాలను.. ముఖ్యంగా పార్కు స్థలాలను కబ్జా చేసి నిర్మించిన అక్రమ నిర్మాణాల కూల్చివేతకు హైడ్రా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఎన్నిసార్లు హెచ్చరించినా.. కొంతమంది కబ్జాదారులు వాటిని పెడచెవిన పెడుతూ.. పెద్దపెద్ద కట్టడాలను నిర్మించడం లేదా అమాయకులకు తప్పుడు పత్రాలు సృష్టించి విక్రయించడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

కొర్రెములలో కబ్జాపై హైడ్రా ఉక్కుపాదం..

తాజాగా.. ఎల్బీనగర్ జోన్ పోచారం సర్కిల్ పరిధిలోని కొర్రెముల గ్రామంలో జరిగిన ఒక ఘటన దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. కొర్రెములలోని సర్వే నంబర్ 747, 750లలో ఉన్న సుమారు 1034 గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించి ప్రహరీ గోడను నిర్మించారు. గతంలో కూడా హైడ్రా అధికారులు ఈ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. అయినప్పటికీ.. కబ్జాదారులు మళ్లీ ధైర్యం చేసి అదే స్థలంలో పునర్నిర్మాణాలు చేపట్టారు. దీంతో విసిగిపోయిన స్థానికులు మరోసారి అధికారులకు ఫిర్యాదు చేయడంతో.. సోమవారం నాడు హైడ్రా అధికారులు బందోబస్తుతో వెళ్లి ఆ ప్రహరీ గోడను పూర్తిగా కూల్చివేశారు.

ప్రభుత్వ స్థలాల్లో కబ్జాదారులు కాకుండా.. ప్రజల కోసం పౌర సౌకర్యాలు ఆట స్థలాలు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు వంటివి అభివృద్ధి చేయడం.. నగర విస్తరణకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు చేయడం, భవిష్యత్తులో రహదారులు, రవాణా వ్యవస్థల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం కూడా దీనిలో భాగంగా ఉన్నాయి.

లేఅవుట్లలో పార్కు స్థలాలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలే కాకుండా.. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హైడ్రా అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఎవరైనా ఇంటిని లేదా ప్లాటును కొనుగోలు చేసేటప్పుడు.. దాని పక్కన ఉన్న స్థలం నిజంగా పార్కు స్థలమా, ప్రభుత్వ భూమా అనేది ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకుంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే.. కబ్జాదారుల తప్పుడు పత్రాల బారిన పడి భారీగా నష్టపోవాల్సి వస్తుంది.

# తెలంగాణ గ్లోబల్ సమిట్,.. రూ. లక్ష కోట్ల పెట్టుబడికి 'డొనాల్డ్ ట్రంప్' కంపెనీ రెడీ

రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా రెండు రోజుల పాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' సోమవారం (డిసెంబర్ 8) అట్టహాసంగా ప్రారంభం అయింది. భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ సదస్సును తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభించారు. ఈ రైజింగ్ సమిట్ వేదికగా తెలంగాణలో భారీ పెట్టుబడులు ప్రకటించింది ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ. ఈ మేరకు ఈ కంపెనీ డైరెక్టర్ ఎరిక్.. వచ్చే పదేళ్లలో రూ. లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటన చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎరిక్ వెల్లడించారు. ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్పోరేషన్ లో.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన డోనాల్డ్ ట్రంప్ రివోకబుల్ ట్రస్ట్‌కు 52 శాతం వాటా ఉంది. ఈ ట్రస్ట్ కింద మరిన్ని కంపెనీలు ఉన్నాయి. ఫ్లోరిడా లోని సరసోటా కేంద్రంగా ఈ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ తరచూ పోస్టులు చేసే ట్రూత్ సోషల్‌ను కూడా ఈ కంపెనీ నిర్వహిస్తోంది. కాగా, హైదరాబాద్‌లో ఓ ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం తెలిసిందే. సిటీలోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయం పక్కన ఉన్న రహదారికి "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ"గా పేరు పెట్టాలని చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రూ. 25 వేల కోట్లతో అదానీ డేటా సెంటర్..

ఈ సదస్సులో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ అదానీ కూడా భారీ ప్రకటన చేశారు. రూ. 25 వేల కోట్ల పెట్టుబడితో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. రూ. 4 వేల కోట్లతో రహదారి సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు.




మరోవైపు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు 44 పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన కంపెనీల నుంచి ప్రతినిధుల బృందాలు ఈ సదస్సులో పాల్గొంటున్నాయి. అమెరికా నుంచే వివిధ కంపెనీలకు చెందిన 46 మంది ప్రతినిధులు వస్తున్నారు. రెండు రోజుల సదస్సులో మొత్తం 27 అంశాలపై చర్చలు జరగనున్నాయి. అందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. సదస్సు నిర్వహిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణమంతా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. కాగా తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లుతో కూడిన బహుమతిని అందించనున్నారు.

# రేపటి నుంచి వైన్స్ బంద్.. డిసెంబర్ 11న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు



తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలపై నిషేధం విధించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చూడటానికి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. తొలి విడత ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో రేపు (డిసెంబర్ 9) సాయంత్రం 5 గంటల నుంచే మద్యం దుకాణాలు మూతపడనున్నాయి.

మూడు విడతల్లో మద్యం నిషేధం..

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 11, 14, 17 తేదీలలో మూడు విడతల్లో జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణ ప్రాంతాల్లో.. ఈ తేదీలకు ముందు, పోలింగ్ ముగిసి ఫలితాలు వెల్లడయ్యే వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

డిసెంబర్ 11వ తేదీన ఎన్నికల సందర్భంగా.. రేపు (డిసెంబర్ 9) సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 11న ఎన్నికలు.. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఆయా మండలాల్లోని మద్యం దుకాణాలు మూతపడతాయి. ఈ తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,236 స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. రెండవ విడత (డిసెంబర్ 14) ఎన్నికల సందర్భంగా.. డిసెంబర్ 12న సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 14న ఫలితాలు వచ్చేంత వరకు ఆయా గ్రామాల్లో మద్యం నిషేధం అమలవుతుంది. మూడవ విడత (డిసెంబర్ 17) ఎన్నికల సందర్భంగా.. డిసెంబర్ 15న సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 17న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఆయా మండలాల్లోని మద్యం దుకాణాలు పూర్తిగా మూసివేసి ఉంచుతారు.

ఈ నిషేధాజ్ఞలు కేవలం వైన్ షాపులకు మాత్రమే కాకుండా.. ఎన్నికలు జరిగే ప్రాంతాల పరిధిలోని బార్లు , అలాగే మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లకు కూడా వర్తిస్తాయని కలెక్టర్లు స్పష్టం చేశారు. అధికారులు జారీ చేసిన ఆదేశాలను అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు తెరిచినా.. లేదా దొంగచాటుగా మద్యం విక్రయించినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఎన్నికల ప్రాంతాల్లో అధికారులు నిఘాను పెంచారు. ఈ ఎన్నికల్లో నాయకులతో పాటు ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొంటూ.. తమ గ్రామ భవిష్యత్తును నిర్ణయించే సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎన్నికలు జరిగిన రోజు సాయంత్రమే ఫలితాలను అధికారులు వెల్లడించనున్నారు.

# తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు.. ఆ రెండు రోజులు స్కూళ్లకు సెలవు

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి కొనసాగుతోంది. ఈ ఎన్నికలను మూడు విడతల్లో డిసెంబర్ 11, 14, 17 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ సులభంగా.. ప్రశాంతంగా జరిగేలా చూడటానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా.. పోలింగ్ కేంద్రాలుగా మారనున్న ఆయా పాఠశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించే అవకాశం ఉంది. తొలి విడత ఎన్నికల సన్నద్ధత.. తొలి విడత ఎన్నికల కోసం అధికారులు ఇప్పటికే సన్నాహాలు పూర్తి చేస్తున్నారు. తొలి విడతలో మొత్తం 4,159 గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల కోసం ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కొన్ని ప్రైవేట్ పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగిస్తారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, పోలింగ్ సామాగ్రి భద్రత వంటి కారణాల వల్ల ఈ పాఠశాలలకు సెలవులు ప్రకటించడం ఆనవాయితీ.

డిసెంబర్ 11, 17 తేదీల్లో పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 14 ఇప్పటికే ఆదివారం కావడం వల్ల సాధారణంగానే సెలవు ఉంటుంది. కాబట్టి.. డిసెంబర్ 11, డిసెంబర్ 17 తేదీల్లో పోలింగ్ జరగనున్న ప్రాంతాలలోని పాఠశాలలకు మాత్రమే ప్రత్యేక సెలవులు ప్రకటించే అవకాశం ఉంది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది. ఎన్నికల కారణంగా పాఠశాలలకు సెలవు ఇవ్వడం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కొన్ని మార్పులు ఉంటాయి. ఎన్నికల కారణంగా తరగతులు నష్టపోకుండా ఉండేందుకు.. ఆయా పాఠశాలలు తర్వాత రోజుల్లో పని దినాలను పెంచే అవకాశం లేదా ఆన్‌లైన్ తరగతుల ద్వారా సిలబస్‌ను పూర్తి చేసే అవకాశం ఉంది. చాలా మంది ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. పోలింగ్ అధికారులుగా, సిబ్బందిగా పనిచేయడం వల్ల కూడా పాఠశాల నిర్వహణకు ఇబ్బంది కలుగుతుంది. అందుకే సెలవులు తప్పనిసరి అవుతాయి. పోలింగ్ కేంద్రాలను సురక్షితంగా సిద్ధం చేయడం, భద్రతా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలను కూడా విద్యా సంస్థల ప్రాంగణంలోనే అధికారులు చేపడతారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి సెలవులు కీలకం



# హైదరాబాద్‌లో కొత్త సినిమా థియేటర్లు.. సంక్రాంతి నాటికి ప్రారంభం



సినిమాలంటే తెలుగు ప్రేక్షకులకు ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సినిమాల్లో అంచెలంచెలుగా ఎదిగి రాజకీయాలను ఏలుతున్న నటులను కూడా చూస్తూనే ఉన్నాం. సినిమా రంగానికి తెలుగు ప్రేక్షకులు అందిస్తున్న ఆదరణ అలాంటిది. ఈ నేపథ్యంలో ప్రపంచస్థాయి సినిమా నిర్మాణానికి హైదరాబాద్ వేదిక అవుతోంది. అందులో భాగంగానే భారీ మొత్తంలో ఖర్చు చేసి సినిమాలను నిర్మిస్తున్నారు. ఇక సిటీలో సినిమా చూసే కల్చర్ కూడా వేగంగా మారుతోంది. మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా.. వారికి సరికొత్త వినోదాన్ని, అనుభూతిని అందించడానికి అత్యాధునిక టెక్నాలజీతో థియేటర్లను నిర్మిస్తున్నారు. అలా నిర్మించిన పలు థియేటర్లు ఈ సంక్రాతి నాటికి ప్రారంభం కానున్నాయి. ఆ వివరాలు..

హైదరాబాద్‌లో సినిమా ప్రియులకు చాలా ఇష్టమైన ప్రదేశం ఆర్టీసీ ఎక్స్ రోడ్స్. హైదరాబాద్‌లో సింగిల్ స్క్రీన్ థియేటర్స్ అంటే ఫస్ట్ గుర్తొచ్చేది ఆర్టీసీ క్రాస్ రోడ్సే. ఇక్కడ సినిమా ఫ్యాన్స్‌తో పండగ వాతావరణం ఉంటుంది. ఏ కొత్త సినిమా విడుదల అయినా ఇక్కడికి అనేక మంది ప్రేక్షకులు తరలివస్తారు. ప్రసిద్ధి చెందిన సంధ్య, సుదర్శన్ థియేటర్లు ఇక్కడే ఉన్నాయి. త్వరలో ఇక్కడి ఓడియన్ మాల్‌లో 8 స్క్రీన్లతో పీవీఆర్ ఐనాక్స్ మల్టీప్లెక్స్ ప్రారంభం అవుతోంది. ప్రైమ్ ప్లేస్‌లో ఉడంటంతో ఈ మాల్‌కు పెద్ద సంఖ్యలో సినిమా ప్రియులు వస్తారని, ఈ మాల్ వినోదానికి ప్రధాన కేంద్రంగా మారుతుందని భావిస్తున్నారు.

2. లేక్‌షోర్ మాల్ – కూకట్‌పల్లి

కూకట్‌పల్లి వై జంక్షన్‌లో లేక్‌షోర్ మాల్ ఉంది. ఇందులో పీవీఆర్ ఐనాక్స్ మల్టీప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ మల్టీప్లెక్స్‌లో 9 స్క్రీన్‌లు ఉంటాయి. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతం వాసులకు ఈ మల్టీప్లెక్స్ సరికొత్త అనుభూతి అందించనుంది. ఇందులో తెలుగుతో పాటు జాతీయ అంతర్జాతీయ సినిమాలు కూడా ప్రేక్షకులకు వినోదం పంచనున్నాయి.

3. అల్లు సినిమాస్ – కోకాపేట

నగరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ఒకటైన కోకాపేటలో.. అల్లు సినిమాస్ సంస్థ 4 స్క్రీన్ల మల్టీప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఇందులో దేశంలోనే అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్ ఏర్పాటు కానుండటం విశేషం. కాగా, జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన.. సినిమా ప్రియులందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'తో గ్రాండ్‌గా ఈ మల్టీప్లెక్స్ ఓపెనింగ్ జరగనుందని తెలుస్తోంది.

4. అపర్ణ మాల్ – శంషాబాద్

కాగా, శంషాబాద్‌లోని అపర్ణ మాల్‌లో 7 స్క్రీన్ల మల్టీప్లెక్స్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ మల్టీప్లెక్స్ మార్చి 2026లో ప్రారంభం కానుందని తెలుస్తోంది.

# సెలవులే సెలవులు,,,




తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు, విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే 2026 సంవత్సరానికి సంబంధించిన సెలవుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ సెలవుల జాబితాను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశాల మేరకు.. సాధారణ పరిపాలన విభాగం ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ కార్యాలయాలకు మొత్తం 53 సెలవులు..

వచ్చే ఏడాది (2026)కి తెలంగాణ ప్రభుత్వం మొత్తం 27 సాధారణ సెలవులు మరియు 26 ఐచ్ఛిక సెలవులను ప్రకటించింది. ఈ సాధారణ సెలవు దినాలలో అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మూసివేయబడతాయి.

ప్రధాన సాధారణ సెలవు దినాలు (2026)..

తెలంగాణ ప్రజలు జరుపుకునే ప్రధాన పండుగలు, జాతీయ దినోత్సవాలను దృష్టిలో ఉంచుకుని సాధారణ సెలవులను ప్రకటించారు. వీటిలో కొన్ని ముఖ్యమైనవి.. సంక్రాంతి (జనవరి 15), గణతంత్ర దినోత్సవం (జనవరి 26), హోలీ (మార్చి 3), ఉగాది (మార్చి 19), ఈదుల్ ఫితర్ / రంజాన్ (మార్చి 21), శ్రీ రామ నవమి (మార్చి 27), డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14), ఈదుల్ అజహా / బక్రీద్ (మే 27), బోనాలు (ఆగస్టు 10), స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), వినాయక చవితి (సెప్టెంబర్ 14), విజయ దశమి / దసరా (అక్టోబర్ 20), దీపావళి (నవంబర్ 8), క్రిస్మస్ (డిసెంబర్ 25). ఈ సెలవులతో పాటు.. ప్రతి నెలలోని ఆదివారాలు, రెండవ శనివారాలు కూడా యథావిధిగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలుగా కొనసాగుతాయి.

ఐచ్ఛిక సెలవులు..

సాధారణ సెలవులతో పాటు.. 2026 సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన 26 ఐచ్ఛిక సెలవుల జాబితా కూడా ఉంది. ఈ సెలవులలో ఉద్యోగులు తమ మతాచారాలు లేదా వ్యక్తిగత ప్రాధాన్యతలను బట్టి.. మొత్తం ఐచ్ఛిక సెలవుల్లో నుంచి ఐదు రోజులు మాత్రమే వినియోగించుకునే సదుపాయం ఉంటుంది. ముఖ్యమైన ఐచ్ఛిక సెలవులు (2026).. న్యూ ఇయర్ డే (జనవరి 1), కనుమ (జనవరి 16), శ్రీ పంచమి (జనవరి 23), మహావీర్ జయంతి (మార్చి 31), బుద్ధ పౌర్ణమి (మే 1), నరక చతుర్దశి (నవంబర్ 8), క్రిస్మస్ ఈవ్ (డిసెంబర్ 24). ఈ విధంగా తెలంగాణ ప్రభుత్వం జాతీయ పండుగలు, రాష్ట్ర పండుగలు , మతపరమైన వేడుకలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సెలవుల జాబితాను రూపొందించింది.

# వందేమాతరంను జిన్నా వ్యతిరేకించగానే.. నెహ్రూ అంగీకరించారు..

## లోక్‌సభలో ప్రధాని మోదీ



**నమస్తే హైదరాబాద్ :** భారత జాతీయ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభలో చర్చ జరిగింది. ఈ చర్చ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై, భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ గేయాన్ని కాంగ్రెస్ పార్టీతో పాటు.. మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ వైఖరికి ముడిపెట్టి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో వందేమాతరం 100వ వార్షికోత్సవం నాటి పరిస్థితులను మోదీ గుర్తుచేస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు.


వందేమాతరం అమల్లోకి వచ్చి 100 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు.. వార్షికోత్సవాలు జరుపుకుంటుండగా.. భారతదేశం ఎమర్జెన్సీలో చిక్కుకుందని.. భారత రాజ్యాంగం గొంతును నులమేశారని మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం సాధించి పెట్టిన వందేమాతరం గేయానికి ఇప్పుడు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. దాని గొప్పదనాన్ని మళ్లీ తీసుకురావడానికి ఇదే సరైన అవకాశమని ప్రధాని మోదీ లోక్‌సభ వేదికగా పేర్కొన్నారు.

వందేమాతరంను వ్యతిరేకించడంలో నెహ్రూ, మహ్మద్ అలీ జిన్నాను అనుసరించారని ప్రధాని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు. కొంతమంది ముస్లిం వర్గాలను ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకే జవహర్ లాల్ నెహ్రూ.. వందేమాతరం వ్యతిరేకంగా పనిచేశారని మోదీ ఆరోపించారు. 1937లో కాంగ్రెస్, జాతీయ సమావేశాల్లో వందేమాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే ఉపయోగించాలని నిర్ణయించింది. దుర్గా, సరస్వతి వంటి హిందూ దేవతలను ప్రస్తావించే మిగతా 6 చరణాలను కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో వాటిని తొలగించాలని తెలిపారు.

వందే మాతరంలోని చరణాలను తొలగిస్తూ కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శిస్తున్న బీజేపీ.. దాన్ని దేశ విభజన ఎజెండా అని అభివర్ణిస్తోంది. 1937లో వందేమాతరంలోని ఒక భాగాన్ని ఖండించారని.. దాన్ని చీల్చివేశారని.. ఆ విభజనే దేశ విభజనకు బీజం వేసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇక గతంలో నెహ్రూ రాసిన లేఖలను గుర్తు చేసిన బీజేపీ అధికార ప్రతినిధి సి.ఆర్. కేశవన్.. వందేమాతరంలో దేవతలను ప్రస్తావించడం అసంబద్ధమని నెహ్రూ పేర్కొన్నట్లు ఆరోపించారు.

అయితే నెహ్రూ మాత్రం.. తన లేఖల్లో ఆ చరణాలను దేవతలకు ముడిపెట్టడం అసంబద్ధమే కానీ.. ఆ పాట ఎలాంటి హానిచేయని అని పేర్కొనడం గమనార్హం. అయితే దాని సాహిత్యం ఆధునిక జాతీయవాద భావనలకు అనుగుణంగా లేదని కూడా నెహ్రూ రాశారు. నిజమైన మనోవేదనలను తీర్చడానికి మతతత్వవాదుల భావనలకు లొంగిపోలేమని కూడా నెహ్రూ తన లేఖల్లో పేర్కొన్నారు.

# కదిరిలోని ఆలయంలో జరిగిన దొంగతనంపై స్పందించిన చంద్రబాబు



**నమస్తే హైదరాబాద్ :** శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ఒక దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆలయ ఆస్తులను సంరక్షించాల్సిన ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో)యే భక్షకుడిగా మారి, గుడిలోని అమ్మవారి సొమ్మును దోచుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వివరాల్లోకి వెళితే, కదిరి రూరల్ మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఈవోగా పనిచేస్తున్న మురళీకృష్ణ, గుడిలోని సుమారు 5 కిలోల వెండి ఆభరణాలు, పట్టుచీరలు, ఇతర విలువైన వస్తువులను చోరీ చేస్తూ పట్టుబడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మురళీకృష్ణపై కేసు నమోదు చేశారు.ఈ ఘటన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఈవో మురళీకృష్ణను తక్షణమే సస్పెండ్ చేయాలని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దేవాలయాల్లో ఇలాంటి తప్పుడు పనులకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వందేమాతరం యావత్ దేశానికి స్ఫూర్తినిచ్చింది: లోక్‌సభలో ప్రధాని మోదీ



**నమస్తే హైదరాబాద్ :** జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని సోమవారం పార్లమెంట్ వేదికగా ప్రత్యేక చర్చ జరిగింది. లోక్‌సభలో ఈ చర్చను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ.. 'వందేమాతరం మంత్రం' స్వాతంత్ర్య సమరంలో యావత్ దేశ ప్రజలకు శక్తిని, ప్రేరణను ఇచ్చిందని కొనియాడారు. ముఖ్యంగా ఉత్తరం నుంచి దక్షిణం వరకు, తూర్పు నుంచి పడమర వరకు దేశ ప్రజలందరినీ ఒకతాటిపైకి తీసుకు వచ్చిందని మోదీ అన్నారు.

ఈ చర్చ కోసం దిగువ సభలో 10 గంటల సమయాన్ని కేటాయించారు. "వందేమాతరం 150వ చారిత్రక ఘట్టానికి మనం సాక్షులుగా నిలిచాం. దేశం సర్దార్ పటేల్, బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను కూడా జరుపుకుంటోంది. ఈ చర్చ సభ నిబద్ధతను తెలియజేయడంతో పాటు భావితరాలకు కూడా ఉపయోగపడుతుందని చెబుతోంది" అని ప్రధాని మోదీ తెలిపారు.

వందేమాతరం రచించినప్పుడు భారత్ బానిసత్వంలో ఉందని.. దానికి వంద సంవత్సరాలు పూర్తయినప్పుడు దేశంలో రాజ్యాంగం గొంతు నొక్కేసిన చీకటి కాలం (ఎమర్జెన్సీ) నడిచిందని గుర్తు చేశారు. ఇవాళ మనం ఇక్కడ కూర్చున్నామంటే.. లక్షలాది మంది వందేమాతరం ఆలపించడంతోనే సాధ్యమైందని ఆయన తెలిపారు. బ్రిటీష్ పాలకులు 'గాడ్ సేవ్ ద క్వీన్' అనే గీతాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో.. బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని రచించారని మోదీ గుర్తు చేశారు. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛా మంత్రం మాత్రమే కాదని.. బ్రిటీష్ పాలన నుంచి భారతమాత స్వేచ్ఛ కోసం జరిగిన పవిత్ర యుద్ధం అని ఆయన అన్నారు.

వందేమాతరం ఈ భూమి నా తల్లి, నేను భూమి పుత్రుడిని అనే భావనను కల్గిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. ఈ గీతం పరాయి పాలనలో ఉన్న భారతీయుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ఆశలను నింపిందని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటం కేవలం భూమి, అధికారం కోసం కాదని.. బానిసత్వ సంకెళ్లను తెంచుకొని సంస్కృతిని పునరుజ్జీవింపజేయడానికే అన్న సందేశాన్ని వందేమాతరం ఇచ్చిందని వివరించారు. ఈ చర్చలో అధికార, ప్రతిపక్షాలు లేవని మోదీ ప్రకటించారు. ఇప్పుడు మరోసారి ఐక్యంగా అంతా ముందుకు సాగాల్సిన సమయం వచ్చిందన్నారు.

ఈ గీతం మన స్వాతంత్ర్య సమరయోధుల కలలను నెరవేర్చడానికి స్ఫూర్తిని, శక్తిని ఇవ్వాలని ఆకాంక్షించారు. 2047 నాటికి దేశాన్ని ఆత్మనిర్భరంగా, అభివృద్ధి చెందిన దేశంగా మార్చే సంకల్పాన్ని పునరుద్ఘాటించాలని కోరారు. విపక్ష కాంగ్రెస్ తరపున లోక్‌సభలో పార్టీ ఉప నేత గౌరవ్ గొగొయ్, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా తదితరులు పాల్గొననున్నారు.

# వెలిగొండకు మరోసారి మంత్రి నిమ్మల

### నేటి రాత్రి దోర్నాలకు వచ్చి బస

### రేపు పనుల పరిశీలన, అధికారులతో సమీక్ష

### నెలలో మూడోసారి రాక

### ప్రాజెక్టు తొలిదశ పూర్తిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



**నమస్తే హైదరాబాద్ :** ఒంగోలు, డిసెంబరు 8 రాష్ట్ర జలవ నరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు వస్తున్నారు. మంగళవారం రాత్రికి దోర్నాల చేరుకుని బుధవారం ఉదయం ప్రాజెక్టు పనులు పరిశీలించడంతోపాటు అధికారులు, పనులు చేస్తున్న ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష చేస్తారు. ఆమేరకు సంబంధిత అధికారులకు సమాచారం అందింది. వెలిగొండ తొలిదశను వచ్చే ఏడాది జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రి నిమ్మల ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. గత నెలలో వరుసగా రెండుసార్లు ప్రాజెక్టును సందర్శించారు. అంతకుముందు సీఎం ఉన్నత స్థాయి సమీక్షలలో చేసిన నిర్ణయాలకు అనుగుణంగా పనుల పురోగతిపై నిరంతరం ఇక్కడి అధికారులతో ఆయన పర్యవేక్షిస్తున్నారు.మొంథాతో నిలిచిన పనులుఅక్టోబరు ఆఖరులో జిల్లాలో జలప్రళయం సృష్టించిన మొంథా తుఫాన్ కారణంగా వెలిగొండ పనులు కూడా నిలిచిపోయాయి. లైనింగ్ జరుగుతున్న రెండో టన్నెల్‌లోకి భారీగా వరదనీరు చేరింది. అలాగే కీలకమైన ఫీడర్ కాలువకు అనేకచోట్ల భారీగా గండ్లుపడ్డాయి. ఈ నేపథ్యంలో నవంబరు 7న వెలిగొండను సందర్శించిన మంత్రి నిమ్మల సంబంధిత ఆటంకాలను పరిశీలించి తక్షణ చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మళ్లీ వచ్చి పరిశీలిస్తానని, ఆలోపు తిరిగి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో అధికారులు, ఉరుకులు పరుగులతో అత్యవసర పనులు చేపట్టి టన్నెల్‌లో నీటి తొలగింపు, ఫీడర్ కాలువ గండ్లు పూడ్చివేత, మేట వేసిన మట్టి తొలగింపు తదితర పనులను కొలిక్కి తెచ్చారు. చెప్పినట్లు తిరిగి నవంబరు 12న మంత్రి నిమ్మల వెలిగొండ పనుల పరిశీలన కోసం వచ్చారు. తాను ఆశించిన విధంగా పనులు పూర్తికాలేదని అసహనం వ్యక్తం చేసి మరికొన్ని సూచనలు ప్రాజెక్టు అధికారులకు చేశారు. తదనుగుణంగా చర్యలను వారు తీసుకొన్నారు. ప్రస్తుతం టన్నెల్-2లో లైనింగ్ పనులు సాగుతున్నాయి. రేపు మరోసారి పరిశీలనఫీడర్ కాలువ ఆధునికీకరణకు సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తయి పనులు చేపట్టేందుకు ఏజెన్సీ ప్రతినిధులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి వెలిగొండకు వస్తున్నారు. అందిన సమాచారం మేరకు ఆయన మంగళవారం సాయంత్రం విజయవాడలో బయల్దేరి రాత్రికి దోర్నాల చేరుకొని బస చేస్తారు. బుధవారం ఉదయం వెలిగొండ పనులను పరిశీలిస్తారు. అధికారుల, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. తిరిగి విజయవాడ వెళ్తారు. ఆ మేరకు సమాచారం అందుకున్న జలవనరుల శాఖ అధికారులు తదనుగుణ ఏర్పాట్లపై దృష్టిసారించారు.

# "రైతులకు శుభవార్త: పెట్రోల్, డీజిల్ లేకుండా 6 పనులు చేసుకునే కొత్త టెక్నాలజీ!"



**నమస్తే హైదరాబాద్ :** రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు రీగ్రో అనే సంస్థ ఒక కొత్త పరికరం "క్రాప్ సిక్సర్" ను పరిచయం చేసింది. ఈ యంత్రం ద్వారా ఆరు రకాల వ్యవసాయ పనులను సులభంగా చేయవచ్చు, మరియు ఇది పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలను అవసరం చేయకుండా బ్యాటరీతో పనిచేస్తుంది.ఈ క్రాప్ సిక్సర్‌ను విశాఖలోని ఆర్గానిక్ మేళా కార్యక్రమంలో ప్రదర్శించారు. బ్యాటరీ ఆధారితంగా పనిచేసే ఈ పరికరం రైతులకు పెద్ద  అవుతుందని అధికారులు చెప్తున్నారు.భారతదేశం, వ్యవసాయ రంగంపై ఆధారపడిన దేశం. అయితే, ఈ రంగం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రకృతి విపత్తులు, పంట ధరల తగ్గుదల, పెరుగుతున్న ఖర్చులు రైతులను కష్టాల్లో నెట్టేస్తున్నాయి. మరోవైపు, అధిక పెట్టుబడులు, అనవసరమైన భారం అన్నీ వ్యవసాయాన్ని నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి కార్యక్రమాలు కూడా వ్యవసాయానికి కూలీలను అందించడం కష్టతరం చేస్తోంది. ఈ నేపథ్యంలో, రీగ్రో సంస్థ రైతులకు సహాయం చేయడానికి క్రాప్ సిక్సర్ అనే కొత్త పరికరాన్ని తయారు చేసింది.ఈ యంత్రం అనేక వ్యవసాయ పనులను చాలా సులభంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. దుక్కి దున్నడం, ఎరువుల పిచికారీ, పంట కోత, చిన్న గోతులు తవ్వడం, కలుపుతీత వంటి పనులు ఈ పరికరం చేయగలుగుతుంది. అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఈ క్రాప్ సిక్సర్ ను ఉపయోగించడానికి పెట్రోల్, డీజిల్ అవసరం లేదు. బ్యాటరీ ఆధారంగా పనిచేసే ఈ యంత్రం ఒక్కసారి ఛార్జ్ చేసుకుంటే, ఎకరాల పొలాన్ని దుక్కి దున్నడం వంటి పనులు చేయగలదు. దీన్ని పూర్తిగా ఛార్జ్ చేయడానికి సుమారుగా నాలుగు గంటలు సమయం పడుతుంది.ఇతర వరుసగా, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. రైతులు సెన్సార్లు, డ్రోన్లు వంటి పరికరాలను ఉపయోగించి నేలలోని తేమ, పోషకాలు, పంట ఆరోగ్యాన్ని అంచనా వేయగలుగుతున్నారు. డ్రోన్లు ఉపయోగించి పురుగుల మందుల పిచికారీ, విత్తనాల చల్లడం, పంటకోత సమయాన్ని అంచనా వేయడం, ఇంకా జీపీఎస్ ఆధారిత ట్రాక్టర్లను ఉపయోగించి విత్తు పనులు, దుక్కి దున్నడం వంటి పనులు సులభం అవుతున్నాయి. ఇక, ఐవోటీ సాంకేతికతను కూడా వ్యవసాయంలో నీటి పంపిణీ వంటి పనులకు ఉపయోగిస్తున్నారు.ఇన్ని ఆధునిక సాంకేతికతలు వ్యవసాయ రంగాన్ని మరింత సమర్థవంతమైన, పర్యావరణానికి హానికరం కాని, లాభదాయకమైన మరియు శక్తి సామర్థ్యం ఉన్న విధంగా మార్చడంలో దోహదం చేస్తాయి.

# గుంటూరు జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న స్క్రబ్ టైఫస్ మరణాలు

ఆంధ్రప్రదేశ్‌లోని  గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో స్క్రబ్ టైఫస్ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వ్యాధితో చికిత్స పొందుతూ ఆదివారం మరో ఇద్దరు మహిళలు మృతి చెందడంతో, మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. మృతులను పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన లూరమ్మ (59), బాపట్ల జిల్లా దేగావారిపాలేనికి చెందిన డి. నాగేంద్రమ్మ (73)గా అధికారులు గుర్తించారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లూరమ్మ నవంబర్ 28న ఆసుపత్రిలో చేరారు. ఆమెకు కిడ్నీ సంబంధిత సమస్యలు కూడా ఉన్నట్లు తెలిసింది. నాగేంద్రమ్మ తీవ్ర జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో చేరారు. ఇద్దరికీ నిర్వహించిన వైద్య పరీక్షల్లో స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, శనివారం రాత్రి ప్రకాశం జిల్లా యర్రగొండపాలేనికి చెందిన ధనమ్మ (64) కూడా ఇదే వ్యాధితో జీజీహెచ్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే.మరో వైపు, ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 50 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వ్యాధి నివారణకు చర్యలు ముమ్మరం చేసింది.

# కదంతొక్కిన ఉక్కు నిర్వాసితులు కుటుంబాలతో పాల్గొన్న నిరుద్యోగులు

**నమస్తే హైదరాబాద్ :** ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 8 తమకు ఉపాధి కల్పించాలని, లేకుంటే వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో స్టీల్‌ప్లాంటు నిర్వాసిత నిరుద్యోగులు సోమవారం భారీ ఎత్తున ధర్నా చేశారు. ప్లాంటు ప్రధానగేటు ముందు ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ బైఠాయించారు. తొలుత ప్లాంటు కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా ప్రధాన గేటు వద్దకు చేరుకున్నారు. నిర్వాసిత నిరుద్యోగులకు స్టీల్‌ప్లాంటు మిగులు భూముల్లో ఎకరా చొప్పున ఇవ్వాలని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని, ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు జీవన భృతి చట్టాన్ని అమలు చేస్తూ నెలకు రూ.25 వేల వంతున చెల్లించాలని పెద్దఎత్తున నినదించారు. అగనంపూడి, వడ్లపూడి, అప్పికొండ, పెదగంట్యాడ, నెలిముక్కు, గంగవరం తదితర ప్రాంతాల నుంచి భారీఎత్తున నిరుద్యోగులు వారి కుటుంబ సభ్యులతో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలో నిర్వాసిత నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించారు.న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి..స్టీల్‌ప్లాంటు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తీరని అన్యాయం జరిగిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. నిర్వాసితుల ధర్నాకు మద్దతు తెలిపిన పలు రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నలభై ఏళ్లుగా నిర్వాసితులు ఉపాధి కోసం ఆశతో ఎదురుచూస్తున్నా, న్యాయం జరగలేదన్నారు. నిర్వాసితుల గోడును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అర్థం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాలో నిర్వాసిత నాయకులు పితాని భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, దేముడు, వంశీకృష్ణ, జగన్, రమణ, రాజకీయ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి రవి, కోమటి శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, గవర వెంకటరమణ, ప్రియాంక, గాయత్రీదేవి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, పరంధామయ్య పాల్గొన్నారు.రాజకీయ ప్రసంగాలను అడ్డుకున్న నిర్వాసితులు....ధర్నాకు సంఘీభావం తెలిపిన కొంతమంది నాయకులు రాజకీయ విమర్శలు చేయడంతో నిర్వాసితులు వద్దని అడ్డుకున్నారు. కేవలం నిర్వాసితుల గురించి మాట్లాడాలని, రాజకీయాలు వద్దని గట్టిగా కేకలు వేయటంతో వారు ప్రసంగాలు ఆపేశారు. నిర్వాసితులకు అండగా ఉంటామని, పోరాటాల్లో పాల్గొంటామని ప్రకటించారు.నిర్వాసితులను నిర్లక్ష్యం చేయటం తగదు..మాజీ మంత్రిఉక్కు నిర్వాసితులను యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. నిర్వాసితులకు ఇంత అన్యాయం జరుగుతుందని నాడు అనుకోలేదని, మంచి జరుగుతుందని భావించామని వ్యాఖ్యానించారు. తన వయస్సు సహకరించినంత వరకు ఉక్కు నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమిస్తానని పేర్కొన్నారు.భారీ పోలీస్ బందోబస్తునిర్వాసితుల ధర్నా నేపథ్యంలో సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

# సాగర్ కాలువలకు పెరిగిన నీటి ప్రవాహం



**నమస్తే హైదరాబాద్ :** దర్శి, డిసెంబరు 8 : సాగర్ కాలువలకు నీటి పరిమా ణాన్ని ఎట్టకేలకు పెంచారు. జిల్లా సరిహద్దుకు చెప్పిన మాట ప్రకారం అధికారులు 2,600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం సాగర్ కాలువలకు నీటి పరిమాణం పూర్తిగా తగ్గడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురిత మయ్యాయి. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకొన్నారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యామ్‌ప్రసాద్ జిల్లాకు నీటి పరిమాణం పెంచాలని ఆదేశించడంతో పల్నాడు జిల్లా లింగంగుంట్ల ఎస్‌ఈ వెంకటరత్నం ఆమేరకు పెంచారు. సీఈ ఆదేశాల ప్రకారం జిల్లాకు సోమవారం 2,600 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

సాగర్ డ్యామ్ నుంచి కుడి కాలువకు పది వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆనీటిలో గుంటూరు బ్రాంచ్ కాలువకు 2,000 క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు 1,500 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు 85/3వ మైలు వద్దకు వచ్చేసరికి 2,600 క్యూసెక్కులు వస్తోంది. ఆ నీటిని పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 655 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 668 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. జిల్లాకు రెండురోజుల్లో 450 క్యూసెక్కుల నీరు పెంచడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు బ్రాంచ్ కాలువకు మరికొంత నీటి పరిమాణం పెంచాల్సి ఉంది. చివరి భూముల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నందున అన్ని మేజర్లకు నీరందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకత ఉంది. ఒంగోలు బ్రాంచ్ కాలువకు అన్ని మేజర్లు, మైనర్లకు నీరు సక్రమంగా అందించేందుకు 800 క్యూసెక్కుల నీరు సరఫరా చేయాల్సి ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటే అన్నిప్రాంతాలకు న్యాయం జరుగుతుంది.

# థాయిలాండ్ వెళ్లనుందా? ఇవి లేకుంటే ప్రవేశం లేదు!



**నమస్తే హైదరాబాద్ :** థాయిలాండ్: మే 2025 నుండి కొత్త వీసా నియమాలు అమలు.. ప్రవేశానికి తప్పనిసరి మార్పులు.థాయిలాండ్‌కు వెళ్తున్న పర్యాటకులకు బిగ్ అలర్ట్. ఈ దేశం మే 2025 నుంచి కొత్త వీసా విధానాలను అమలు చేయనుంది, దాంతో ముందే ఈ మార్పులను అర్థం చేసుకోకపోవడం వల్ల భారతీయులు సహా అన్ని దేశాల పర్యాటకులపై ప్రభావం పడుతుంది.థాయ్ ప్రభుత్వం ఈ కొత్త మార్పుల ద్వారా వలస నియంత్రణలను కట్టుదిట్టం చేయడం, ప్రవేశ ప్రక్రియను స్పష్టంగా అమలు చేయడం లక్ష్యంగా పెట్టింది. ఇటీవల డాన్ ముయాంగ్ విమానాశ్రయంలో ఒక విదేశీ పర్యాటకురాలిని ఇమ్మిగ్రేషన్ అధికారులు "తగినంత నగదు లేదు" అని కారణం చెప్పి ప్రవేశం నిరాకరించడం వైరల్ వీడియోగా మారింది.ఆమె ఆన్‌లైన్‌లో తెలిపినట్లుగా, ఆమె తరచుగా థాయిలాండ్ వెళ్ళేవారు, కానీ ఈసారి ఈ కొత్త నిబంధన కారణంగా ఆమెను దేశంలోకి అనుమతించలేదు. అవసరమైతే మరో విమానాశ్రయం ద్వారా ప్రయత్నించాలని ఇమ్మిగ్రేషన్ సూచించినప్పటికీ, స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.వాస్తవానికి, ఈ నిబంధన కొత్తది కాదు. థాయ్ అధికారిక ప్రవేశ నియమాల ప్రకారం, ప్రతి విదేశీ పర్యాటకుడు తన వద్ద తగినంత ఆర్థిక సామర్థ్యం ఉందని నిరూపించాలి. ఒక వ్యక్తికి కనీసం 20,000 థాయ్ బాట్, కుటుంబానికి కనీసం 40,000 బాట్ ఉండాలి. పర్యాటక వీసా కోసం కూడా ఈ ఆర్థిక రుజువు చూపించాల్సిన అవసరం ఉంది. అవసరమైతే కాన్సులర్ అధికారులు అదనపు పత్రాలను కూడా కోరవచ్చు.వీసా వివరాలు ఇలా ఉన్నాయి: ప్రవేశ వీసా ఫీజు 1,000 బాట్, 60 రోజుల వరకు చెల్లుబాటు, అవసరమైతే బ్యాంకాక్ ఇమ్మిగ్రేషన్ బ????లో పొడిగింపు సాధ్యం. కొన్ని దేశాల పౌరులు బయలుదేరే ముందు తమ స్వదేశంలోని థాయ్ ఎంబసీ లేదా కాన్సులేట్‌లో వీసా కోసం దరఖాస్తు చేయాలి.ప్రయాణికులకు ముఖ్య సూచనలు: థాయిలాండ్ చేరుకునే ముందు కనీసం 20,000 బాట్ నగదు లేదా బ్యాంక్ స్టేట్‌మెంట్ సిద్ధంగా ఉంచుకోవాలి.డాక్యుమెంట్లలో లోపాలు లేకుండా ఉండాలి.బయలుదేరే ముందు సమీప థాయ్ ఎంబసీ/కాన్సులేట్‌లో తాజా వీసా నియమాలు చెక్ చేయాలి.ఎయిర్‌పోర్ట్‌లో ఇమ్మిగ్రేషన్ అధికారులు తీసుకునే నిర్ణయం తుది.విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కొత్త వీసా, ఇమ్మిగ్రేషన్ నియమాలు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులపై ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల, ముందుగానే నియమాలను తెలుసుకుని సిద్ధంగా వెళ్ళడం ఇలాంటి ఇబ్బందులను తప్పించగలదు.

# జనవరి నుంచి మదనపల్లె జిల్లాలో పాలన స్టార్ట్!

**నమస్తే హైదరాబాద్ :** ఏపీలో పాలనా వికేంద్రీకరణ, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించే లక్ష్యంతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది కూటమి ప్రభుత్వం. కొత్త జిల్లాలకు సంబంధించి ఇటీవలే ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే కొత్త జిల్లాల్లో పరిపాలన ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా మదనపల్లె కేంద్రంగా కొత్తగా ఏర్పాటైన జిల్లాలో.. 2026 జనవరి 1 పరిపాలన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.

అక్కడే జిల్లా కలెక్టరేట్..కొత్త జిల్లాలో పారిపాలనకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు అందినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు ఎంపిక చేయడంపై కలెక్టర్ నిషాంత్ కుమార్ దృష్టి సారించారు. ఇప్పటికే మదనపల్లెలో ఉన్న సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని.. నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయంగా ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఇటీవల ప్రారంభించిన డీఎల్‌డీవో కార్యాలయంలో.. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఇక ఇతర విభాగాల కార్యాలయాల కోసం కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.

మదనపల్లెలోని బీటీ కాలేజీలో కొన్ని విభాగాలను, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు తాత్కాలికంగా వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ ఇవి సరిపోకపోతే.. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకునే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో పరిపాలనకు సంబంధించి దాదాపు 60 విభాగాలుంటాయి. వీటికి తాత్కాలిక కార్యాలయాలు అవసరం. అయితే అందులో 50 శాతం కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయొచ్చనే అభిప్రాయానికి వచ్చారు అధికారులు. మిగతా కార్యాలయాలను.. ప్రైవేటు భవనాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో కార్యాలయాలను ఎంపిక చేసి.. ఆ నివేదికను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆఫీస్ ఏర్పాటుకు భవనం ఇంకా దొరకలేదని తెలుస్తోంది. జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలు కొత్త జిల్లాలోని బీటీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. కాగా, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు అయింది. మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లు ఈ కొత్త జిల్లాలో ఉన్నాయి. కాగా, పుంగనూరు నియోజకవర్గంలో రొంపిచెర్ల మండలం మదనపల్లె జిల్లాలో ఉండనుంది. కానీ చిత్తూరు రెవెన్యూ డివిజన్ కిందికి వస్తోంది. గెజిట్ నోటిఫికేషన్‌లో కూడా ఇలాగే ఉంది. అందుకే ఆ మండలాన్ని పీలేరు రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలనే డిమాండ్ వినిపిస్తోంది.



# అదానీ చేతికి విశాఖ స్టీల్ ప్లాంట్..సైలెంట్‌గా ప్రైవేటీకరణ.. షర్మిల




విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై సంగిద్ధం నెలకొంది. ఓవైపు కార్మికుల వేతనాలను ఉత్పత్తి ఆధారంగా చెల్లించాలన్న సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని కార్మికులు నిరసన తెలియజేస్తున్నారు. మరోవైపు దీనిపై రాజకీయ దుమారం రేగుతోంది. అధికార ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. అధికార పక్షంపై సంచలన ఆరోపణలు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని చెబుతున్న కేంద్రం.. నెమ్మదిగా అదానీ చేతిలో పెడుతోందని ఆరోపించారు. ఎక్స్ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. "అమ్మేది లేదంటూనే విశాఖ స్టీల్ ప్లాంట్ గౌతమ్ అదానీ చేతిలో పెడుతున్నారు. విస్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని, అమ్మబోమని, ఆదుకుంటామని బీజేపీ చెప్పేవన్నీ ఉత్తి కబుర్లు మాత్రమే. తెరముందు గొప్పలు చెప్పుకుంటూ.. తెరవెనుక అదానీ కోసం స్కెచ్చులు వేస్తున్నారు. విశాఖ స్టీల్‌పై ప్రధాని మోదీది ఆపరేషన్ సైలెంట్ కిల్లింగ్. అందుకే ఉద్యోగులను తీసేస్తున్నారు. కొత్త నియామకాలు చేపట్టకుండా అడ్డుకున్నారు. అడ్డికి పావుసేరు లెక్కన.. స్టీల్ ప్లాంట్ భూములను అదానీకి ధారాదత్తం చేయాలని చూస్తున్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కుకు ఉరి పెడుతున్నారు. ఒక్కొక్కటిగా అదానీకి అన్ని అప్పగిస్తూ రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్ గా మార్చాలని చూస్తున్నారు" అని షర్మిల తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.'సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారు..'"విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మే కుట్ర మోదీదైతే, దాన్ని అమలు చేస్తున్నది సీఎం చంద్రబాబు. ఒక చేత్తో సాయం అని చెప్పి.. మరో చేత్తో లాక్కుంటున్నారు. పొమ్మనకుండా పొగపెట్టిన చందాన.. నష్టాల సాకు చూపి స్టీల్ ప్లాంట్ ఉద్యోగులను వేధిస్తున్నారు. పనికొద్ది జీతమని ప్రపంచంలో లేని రూల్స్‌ను పెడుతున్నారు. టెండర్ల పేరుతో ముక్కలు చేసి విడిభాగాలుగా అమ్మకానికి పెడుతున్నారు. ఈ ప్రక్రియలో ప్రతి అడుగూ ఆదానీకి చేతిలో పెట్టడానికి వేస్తున్నారు. స్టీల్ ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకులను ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారు" అంటూ ధ్వజమెత్తారు షర్మిల 'ప్రధాని ప్రకటన చేయాలి.. 'విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే.. తెలుగు వారి ఆత్మగౌరవం మీద గౌరవముంటే, అదానీకి కట్టబెట్టే ఆలోచనే లేకుంటే.. వెంటనే ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోదీ ప్రకటన చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌ను అమ్మేది లేదని చెప్పాలన్నారు. విశాఖ స్టీల్‌కు సొంతగా గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే విశాఖ స్టీల్‌ను ఎస్ఏఐఎల్‌లో విలీనం చేస్తున్నట్లు హామీ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని అధికార కూటమికి చెందిన ఎంపీలకు దమ్ముంటే.. ప్రధానితో ఈ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

## నా వ్యాఖ్యల్ని కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారు



**నమస్తే హైదరాబాద్ :** షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) కూడా క్రీమీలేయర్ విధానాన్ని వర్తింపజేయాలని తాను ఇచ్చిన తీర్పుపై సొంత వర్గం నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వెల్లడించారు. రిజర్వేషన్ల ఫలాలు నిజంగా వెనుకబడిన వర్గాలకు చేరాలన్నదే తన ఉద్దేశమని ఆయన తన వైఖరిని గట్టిగా సమర్థించుకున్నారు."భారత ప్రధాన న్యాయమూర్తి కుమారుడికి, గ్రామ పంచాయతీ పాఠశాలలో చదివిన ఒక కూలీ కుమారుడికి ఒకే రకమైన కొలమానం వర్తింపజేయడం రాజ్యాంగం చెప్పిన సమానత్వం ఎలా అవుతుంది?" అని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్ ప్రయోజనాలు పొంది సుప్రీంకోర్టు జడ్జి అయ్యాక, ఇప్పుడు ఇతరులకు ఆ ఫలాలు అందకుండా చేస్తున్నానని తనపై ఆరోపణలు చేశారని గవాయ్ గుర్తు చేసుకున్నారు.అయితే, ఈ విమర్శలు రాజ్యాంగ నిబంధనలపై అవగాహన లేమితో చేస్తున్నారని ఆయన అన్నారు. "సుప్రీంకోర్టు, హైకోర్టు వంటి రాజ్యాంగ పదవులకు రిజర్వేషన్లు ఉండవన్న ప్రాథమిక విషయం కూడా విమర్శించే వారికి తెలియదు. ఈ పదవులకు ఇతరులతో పోటీపడి మాత్రమే ఎంపిక కావాలి" అని ఆయన స్పష్టం చేశారు.

# హైవే మీద ధూమ్ రేంజులో చోరీ.. ట్విస్ట్ మాత్రం అదుర్స్



**నమస్తే హైదరాబాద్ :** తాడిని తన్నేవాడుంటే వాడి తలను తన్నే వాడు ఉంటాడనేది పెద్దలు చెప్పే మాట. అలాంటి ఘటనే శ్రీసత్యసాయి జిల్లాలో చోటుచేసుకుంది. కొంతమంది వ్యక్తులు సూరత్ నుంచి హవాలా నగదును బెంగళూరుకు కారులో తరలిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మరో ముఠా.. వీరిని అడ్డగించింది. కారులో తరలిస్తున్న నగదులో రూ.3 కోట్ల రూపాయలను చోరీ చేసింది. అయితే ఇక్కడితో వ్యవహారం పూర్తి కాలేదు. ఆ వెనుక వస్తున్న మరో కారు.. హవాలా గుట్టును రట్టు చేసింది. సూరత్ వ్యక్తులను పోలీసులకు పట్టించింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే..

ఇద్దరు వ్యక్తులు సూరత్ నుంచి హవాలా నగదును బెంగళూరుకు తరలిస్తున్నారు. ఓ కారులో రూ.4.20 కోట్లు తీసుకుని బెంగళూరుకు బయల్దేరారు. అయితే శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్దకు రాగానే.. వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారును కొంతమంది దుండగులు అడ్డగించారు. డబ్బును తరలిస్తున్న విషయం ఎలాగో తెలుసుకున్న దుండగులు.. మరో నాలుగు కార్లతో ఇన్నోవా కారును వెంబడించి. పెనుకొండ వద్ద కారును అడ్డగించారు. ఆ తర్వాత కారుతో పాటుగా సూరత్ వ్యక్తులను కిడ్నాప్ చేశారు. కొంత దూరం తీసుకెళ్లిన తర్వాత ఓ ప్రదేశంలో కారును ఆపి ఇన్నోవా కారులోని హవాలా నగదులో 3 కోట్ల రూపాయలను దుండగులు చోరీ చేశారు. అయితే ఇన్నోవా కారులో సీటు కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలలో ఉన్న రూ.1.20 కోట్లను తీసుకెళ్లడం వారితో కుదరలేదు. దీంతో మూడు కోట్లు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు.

అయితే బెంగళూరు జాతీయ రహదారిపై ఇన్నోవా కారును దుండగులు అడ్డగించిన దృశ్యాలు.. ఆ వెనుక వస్తున్న ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కారు డాష్ కెమెరాలో రికార్డయ్యాయి. దీంతో ఆ ఉద్యోగి.. చెక్ పోస్టు వద్ద ఉన్న పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా.. ఇన్నోవా కారు పోలీసులకు కనిపించింది. దీంతో కారులోని సూరత్ వ్యక్తులను గట్టిగా నిలదీయగా.. అసలు విషయం బయటపడింది. కొంతమంది దుండగులు నాలుగు కార్లలో వచ్చి, తమను అడ్డగించారని.. కిడ్నాప్ చేసి మూడు కోట్లు చోరీ చేశారని పోలీసులకు తెలిపారు.

ఈ క్రమంలోనే ఇన్నోవా కారు సీటు కింద హవాలా డబ్బు దాచేందుకు ప్రత్యేకంగా అరలు ఏర్పాటు చేసిన విషయాన్ని పోలీసులు గుర్తించారు. అందులో ఉన్న కోటీ 20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పెనుకొండ పోలీసులు.. మూడు కోట్లతో పరారైన దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# రామగుండం కార్పొరేషన్‌లో విజిలెన్స్ తనిఖీలు


కోల్‌సిటీ, డిసెంబరు 8 రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యా లయంలో సోమవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్, అకౌం ట్స్ విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. ఇంజ నీరింగ్ విభాగంలో రూ.50లక్షల లోపు పను లపై ఆరా తీశారు.టౌన్ ప్లానింగ్‌లో అను మతుల మంజూరు, దరఖాస్తుల పెండింగ్ తదితర విషయాలపై ఆరా తీశారు. ఆర్థిక విభాగంలో వాహనాలు, డీజిల్, పెట్రోల్ వాడకం, కొనుగోళ్లపై రికార్డులు పరిశీలిం చారు. కార్మికులకు రెయిన్ కోట్లు, యూని ఫాంలు, ఇతర సామగ్రి విషయంపై కార్మికుల తో మాట్లాడారు. కొం దరు కార్మికులు తమ కు సామగ్రి రాలేదని విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఇప్ప టికే తనిఖీలు జరిపా రు. వివిధ విభాగాల పని తీరుపై లోటుపాట్లపై ప్రభుత్వానికి నివేదించే అవ కాశాలున్నాయి.

# మార్కాపురంలో అక్రమ నిర్మాణాలు ఫుల్

## నేటికి వచ్చింది ఆరు దరఖాస్తులే

## అనుమతిలేని కట్టడాలపై చర్యలు శూన్యం

## మామూళ్ల మత్తులో జోగుతున్న పట్టణ ప్రణాళిక విభాగ






**నమస్తే హైదరాబాద్ :** మార్కాపురం, డిసెంబరు 8 మార్కాపురం పట్టణంలో అక్రమ కట్టడాలు, ప్లాన్ తీసుకున్నా అందుకనుగుణంగా కాకుండా ఇష్టారీతిన నిర్మాణాలు చేయడం ఆనవాయితీగా మారింది. ఎలాంటి నిర్మాణం చేయలన్నా ముందుగా నిబంధనల మేరకు ప్లాన్ తయారు చేసుకుని పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి తీసుకోవాలి. కానీ మార్కాపురంలో మాత్రం చాలా వరకు ముందస్తు అనుమతులు తీసుకోకుండానే అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారు. ఎవరైనా సిబ్బంది వస్తే అధికారాన్ని చూపి భయపెట్టడం, చేతులు తడిపి పంపించడం ఆనవాయితీగా మారింది. అక్రమంగా నిర్మించుకున్న భవనాలు, నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఈ మధ్యనే అవకాశం ఇచ్చింది. గత నెల 12 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 120 రోజులపాటు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. కానీ మార్కాపురంలో 25 రోజులు కావస్తున్నా కేవలం 6 దరఖాస్తులే రావడం గమనార్హం. పట్టణ పరిధిలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. మున్సిపల్ అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడంతోనే అక్రమ నిర్మాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.టౌన్ ప్లానింగ్ విభాగం గుర్తించింది 644 నిర్మాణాలు

మార్కాపురం పట్టణ పరిధిలోని 20 సచివాలయాల పరిధిలో టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు. వారు గుర్తించిన మేరకు నవంబరు చివరి నాటికి పట్టణంలో మొత్తం 644 అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. వాటిల్లో కనీస అనుమతుల్లేకుండా నిర్మించినవి 216, ప్లాన్ తీసుకున్నా అందుకు విరుద్ధంగా ఇష్టారీతిన నిర్మాణాలు చేసినవి 428 ఉన్నట్లు తేల్చారు. అక్రమ నిర్మాణాలన్నింటికీ కేవలం నోటీసులు ఇచ్చి మమ అనిపించారు. వాస్తవానికి టౌన్ ప్లానింగ్ సిబ్బంది గుర్తించిన వాటికంటే కూడా ఇంకా ఎక్కువగానే అక్రమ నిర్మాణాలు పట్టణ పరిధిలో ఉన్నాయి. రాజకీయ అండదండలు ఉన్నవారివి, పెద్దమొత్తంలో చేతులు తడిపిన వారివి చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. గతేడాది ప్రధాన రహదారుల్లో ఆక్రమణల తొలగింపు సమయంలో కొన్ని వాణిజ్య సముదాయాలు, భవనాలకు నోటీసులిచ్చి కొంతమేర కూల్చివేశారు. అప్పట్లో పట్టణ అభివృద్ధి కోసం అధికారులపై స్థానిక ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఒత్తిడి చేయడంతో కొంతమేర అక్రమ నిర్మాణాలను నిలువరించగలిచారు. తర్వాత షరామామూలుగానే నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు సాగుతున్నాయి.

బీపీఎస్ వచ్చినా స్పందన శూన్యం

అక్రమంగా నిర్మించుకున్న భవనాలను క్రమబద్ధీకరించుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో జీవో నంబర్ 225 ద్వారా బీపీఎస్ స్కీమ్‌ను అమల్లోకి తెచ్చింది. అనధికారికంగా నిర్మించిన భవనాలు, అనుమతికి మించి నిర్మించుకున్నవి, సెట్‌బ్యాక్ డీవియేషన్ ఉన్న వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి ఈ అవకాశం కల్పించింది. 120 రోజులపాటు ఈ పథకం అమల్లో ఉండనుంది. ప్రభుత్వం ఇంతమంచి అవకాశం కల్పించినా అక్రమ నిర్మాణదారులు స్పందించడంలేదు. జీవో వచ్చి 25 రోజులు కావస్తున్నా నేటికీ మార్కాపురంలో 6 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. యంత్రాంగం గుర్తించినవే 644 నిర్మాణాలు ఉంటే దరఖాస్తు చేసుకోవడానికి కనీస స్పందన ఉండటంలేదని అర్థమవుతోంది.

# 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

## కంపెనీలకు తగ్గట్టుగా జిల్లా యువతకు శిక్షణ

## పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

**నమస్తే హైదరాబాద్ :** కర్నూలు అర్బన్, డిసెంబరు 8 ఎన్నిల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తన లక్ష్యమని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ పెర్కొన్నారు. సోమవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ కేరీర్ సర్వీసు, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను మంత్రి ప్రారంభించారు. విద్య, ఐటీ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు కానున్న కంపెనీలకు తగ్గట్టుగా యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 1,550 మందికి ఉద్యోగాలు ఉన్నాయని, 21 కంపెనీలు జాబ్ మేళాలలో పాల్గొన్నాయన్నారు. జిల్లా ఉపాదికల్పనాధికారి పి. దీప్తి మాట్లా డుతూ జిల్లాలోని నిరుద్యోగులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్ మెంట్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ జజి. గిరిజారాణి, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఓఎస్టీ ఎస్ఎం బాషా, ఎంప్లామెంట్ ఆఫీసర్ సి. చంద్రకళ, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపస్‌లోనే పరిశ్రమల ఏర్పాటు హర్షణీయం

కర్నూలు ఎడ్యుకేషన్: క్యాంపస్‌లోనే పరిశ్రమల ఏర్పాటు హర్షణీయమని మంత్రి టీజీ భరత్ అన్నారు. బి.తాండ్రపాడు శ్రీచైతన్య బాలుర హాస్టల్ క్యాంపస్‌లో సోమవారం ఇంటర్ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, ఉన్నత లక్ష్యాల అంశంపై కేఎల్ యూనివర్సిటీ, శ్రీ చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల కోసం కేఎల్ యూనివర్సిటీ అమలు చేస్తున్న ప్రణాళికలను మంత్రి ప్రశంసించారు. ప్రతిష్టాత్మకైన పరిశ్రమలు ఎన్నో రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్నాయనీ, తద్వారా యువతకు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డా.జే.శ్రీనివాసరావు సమకాలిన విద్యావిదానాలను విశ్లేశించారు. రాయలసీమ జోన్ హెడ్ కేశవగౌడు, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం మురళికృష్ణ, డీన్ బాలాజీ, జోనల ఇన్‌చార్జి కృపరాజు, అద్యాపకులు పాల్గొన్నారు.





# తెలంగాణతో సోనియా బంధం అపురూపం

**నమస్తే హైదరాబాద్ :** అధికారమే పరమావధిగా భావిస్తున్న ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో అందివచ్చిన అధికారాన్ని తృణపాయంగా త్యాగం చేసిన సోనియాగాంధీ, దేశ రాజకీయాలకే ఆదర్శంగా నిలిచారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో 22 ఏండ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా సేవలందించిన సోనియాగాంధీ లౌకికవాదానికి కట్టుబడుతూ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వారసత్వాన్ని కొనసాగించారు. భర్త రాజీవ్‌గాంధీకి తోడుగా అమేథి నియోజకవర్గం బాగోగులను చూసుకుంటూ ప్రజలతో మమేకమై, సమస్యలను పరిష్కరిస్తూ వారి ప్రేమాభిమానాలు పొందారు.ఇందిరాగాంధీ అమానవీయ హత్యతో సోనియాగాంధీ షాక్ అయ్యారు. అనంతరం రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి పదవి చేపట్టాక ఆమెలో ఒకింత ఆందోళన నెలకొన్నది. 1991 మే 21న రాజీవ్‌గాంధీ తమిళనాడులో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో హత్యకు గురయ్యారు. భర్త మరణం తర్వాత%-% కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టి, ప్రధానమంత్రి కావాలని యావత్ దేశం, కాంగ్రెస్ పార్టీ కోరినా... సోనియాగాంధీ సున్నితంగా తిరస్కరించి, రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కొంతకాలం తర్వాత ధైర్యం తెచ్చుకుని, పిల్లలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలకు తన భర్త, అత్త ధైర్యసాహసాలు, వారు చేసిన త్యాగాలు నూరిపోసి గొప్ప దేశ నాయకులుగా తీర్చిదిద్దారు.

'రాజీవ్‌గాంధీ ఫౌండేషన్' చేపట్టే పలు సేవా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బాబ్రీ మసీద్ అల్లర్లు, గుజరాత్ అల్లర్ల సమయంలో దేశంలో లౌకికవాదానికి ముప్పు వాటిల్లిందని ఆమె తల్లడిల్లిపోయారు. వీటితో పాటు సునామీ విపత్తుతో అనాథల్కైన పిల్లలకు చదువు చెప్పించడంతో సహా అన్ని రకాల సహాయసహకారాలను ఆమె ఫౌండేషన్ తరఫున అందించారు. దివ్యాంగులకు ఫౌండేషన్ తరఫున అనేక కార్యక్రమాలు రూపొందించారు.దేశంలో కుల, మత రాజకీయాలు పెరిగిపోయి ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం బలహీనపడడంతో దేశ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఒత్తిడి తేవడంతో సోనియాగాంధీ 1997లో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. 1998లో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టారు. 1999లో లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ప్రజల గొంతుకయ్యారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతగా ఆమె అలుపెరగని పోరాటం చేశారు. సోనియాగాంధీ 2003లో దేశవ్యాప్తంగా దాదాపు 30 వేల మైళ్లు ప్రయాణించి, సుమారు 150 ర్యాలీల్లో పాల్గొన్నారు.

2004 ఎన్నికలలో "కాంగ్రెస్ కీ హాత్.. గరీబోం కీ సాత్" (కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం) అనే నినాదంతో దేశ ప్రజల మనస్సులను చూరగొని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి కేంద్రంలో అధికారం చేపట్టడానికి సోనియా ఎంతో కృషి చేశారు. వామపక్ష పార్టీల మద్దతుతో అప్పుడే ఆమెకి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చింది. కానీ సోనియాపై కక్షగట్టి 'విదేశీ మహిళ' అంటూ బీజేపీ కుట్రలు పన్నింది. ఒక




భారతీయురాలిగా దేశాభివృద్ధి కోసం కృషి చేస్తాను, నాకు పదవుల కంటే దేశం సుభిక్షంగా ఉండడమే ఇష్టం%-% అని తలచిన సోనియాగాంధీ ప్రధానమంత్రి పదవిని త్యాగం చేశారు. దేశాభివృద్ధి కోసం అనుభవజ్ఞుడ్కైన, నిజాయతీకి మారుపేరైన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు ఒప్పించి 10 సంవత్సరాల పాటు ఆయనకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు.దేశాభివృద్ధికి సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ వంటి పథకాలు తీసుకురావడానికి కృషి చేసిన సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని, ఆమె ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకుంటున్నారని బీజేపీ ఆరోపిస్తే, ఆమె ఎన్ఏసీ చైర్మన్ పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసి, పదవులు తనకు తృణపాయమని మరోసారి నిరూపించారు. సోనియాగాంధీ యూపీఏ చైర్మన్‌గా ఉన్నప్పుడే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టారు. ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడే దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్, తొలి దళిత మహిళా లోక్‌సభ స్పీకర్‌గా మీరా కుమార్ ఎంపికే మహిళలకు ఆమె ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనం.

తెలంగాణ రాష్ట్రానికి, సోనియాగాంధీకి మధ్య ఉన్న బంధం వెలకట్టలేనిది. ప్రత్యేక తెలంగాణ కోసం 1969 నుంచి జరిగిన ఉద్యమాలు, రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛను గుర్తించిన సోనియాగాంధీ 2004లో కరీంనగర్ వేదికగా తెలంగాణ ఏర్పాటుపై హామీ ఇచ్చారు. 2009 డిసెంబర్ 9న హెూం మంత్రి చిదంబరం ద్వారా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని ప్రకటింపజేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయకుండా 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన సోనియాగాంధీ ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

# డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎప్పుడూ తలవంచలేదు



**నమస్తే హైదరాబాద్ :** అప్పుడు.. ఇప్పుడు అలానే ఉన్నారు.. మార్పులేదు

సహజ నటి జయసుధ రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినిమాల్లోను ఎవరికీ తలవంచలేదని, ఇప్పుడు రాజకీయాల్లోను అలానే ఉన్నారని సహజ నటి జయసుధ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా సోమవారం వచ్చిన ఆమె హర్షకుమార్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను హర్ష సతీమణి సరళతోపాటు తనయులు జీవీ శ్రీరాజ్, జీవీ సుందర్ ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా జయసుధ విలేకరులతో మాట్లాడారు. 'పవన్‌కల్యాణ్ కోరుకుంటే కోట్లు పెట్టి సినిమాలు తీయడానికి ప్రొడ్యూసర్లు, దర్శకులు ఉన్నారు. కానీ వాటిని వదులుకుని కమిట్‌మెంట్‌తో రాజకీయాల్లోకి వచ్చి నిలబడ్డారు. ఎవరైనా నాకు ఎందుకు వచ్చిన గొడవ అని మధ్యలోనే వదిలి వెళ్లిపోయి ఉండొచ్చు. కానీ పవన్‌కల్యాణ్ అలా కాదు.. నిలబడ్డారు. ఆయనలో అప్పుడు.. ఇప్పుడు ఎటువంటి మార్పులేదు. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం' అని అన్నారు. అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కుటుంబంతో తనకు రాజకీయపరంగా కాకుండా ముందునుంచే సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

గోదావరి జిల్లాల ప్రజలు చూపించే ఆప్యాయత, ఆదరణ ఎనలేనివి... రాజమహేంద్రవరం నాకు సెకండ్ హెూమ్ లాంటిది... అన్నారు సహజ నటి జయసుధ.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన ఆమె సోమవారం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

గోదావరి జిల్లాలతో మీ అనుబంధం?

1975-80 మధ్యలో గోదావరి జిల్లాల్లో షూటింగ్‌లకు వస్తే ఉండేందుకు సరైన హెూటల్ సదుపాయం ఉండేది కాదు. కానీ కాని గోదావరి జిల్లాల ప్రజలు మమ్మల్ని వారి సొంత కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు. వారి ఆప్యాయత మరువలేము.

మీ సొంత ఊరు?

మా నాన్నగారిది తిరుపతి. అమ్మమ్మగారిది విజయనగరం. అయితే నాకు రాజమహేంద్రవరం సెకండ్ హెూమ్ లాంటిది. ఇక్కడి ప్రజలు చాలా ప్రేమగా, గౌరవంగా చూసుకునేవారు. ఆ రోజులు వేరు. అవి గోల్డెన్ డేస్. నాకు కోస్తా ప్రాంతంలో ఫ్యాన్ పాలోయింగ్ వుంది.

సినీ పరిశ్రమలో నాటికీ, నేటికీ వచ్చిన మార్పులు?

చాలా ఆధునిక పరిజ్ఞానం వచ్చింది. అనేక మార్పులు వచ్చాయి. ఎంతో మందికి అవకాశాలు వస్తున్నాయి. కొత్త నటీనటులు వస్తున్నారు. బాగా చేస్తున్నారు. ఓటీటీ రంగ ప్రవేశం చేసింది.

మీరు ఇప్పటివరకు ఎన్ని సినిమాలు చేశారు?

350కు పైగా సినిమాలు చేశాను. అనేక పాత్రలు సంతృప్తి ఇచ్చాయి. కుటుంబ కథా చిత్రాలు బాగా పేరుతెచ్చాయి. నాడు అగ్రనటులతో నటించాను. నేటి అగ్రనటులకు తల్లి పాత్రలు పోషించాను. 25ఏళ్ల తర్వాత మలయళం సినిమా చేస్తున్నాను. ఏ రోల్ పడితే అది చేయను.

ప్రస్తుతం రాజకీయాలపై ఇంట్రస్ట్ వుందా?

గతంలో నేను తెలంగాణలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా చేశాను. ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేను. ఈ వయసులో రాజకీయాలకు సూట్ అవుతానా లేదో చూడాలి. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు. రోల్ అనేది ముఖ్యం. అది ప్రామిస్ చెయ్యలేకపోయినప్పుడు ఉండలేము. రోజూ పని అనేది ఉండాలి. స్మృతిఇరానీలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

మీరు సినీ రంగంలోకి రావడానికి ప్రేరణ?

ఇది చిన్నప్పటి విషయం. గూగుల్‌లో కూడా తప్పులు ఉన్నాయి. నేను 12వ ఏట సినీ పరిశ్రమలోకి వచ్చాను. మా ఆంటీ విజయనిర్మల గారు నన్ను తీసుకువచ్చారు. ఆమె నాకు ప్రేరణ. ఎన్నో సినిమాలు చేశాను. ఆనందంగా ఉంది.

# జపాన్‌ను కుదిపేసిన భారీ భూకంపం - భీకర అలలు ఆగ్రహం!

**నమస్తే హైదరాబాద్ :** జపాన్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. ఈ కుదుపు తీవ్రత రిక్టర్ స్కేల్‌పై సుమారు 7.2గా నమోదైంది. సముద్రం 10 అడుగుల ఎత్తులో అలలు ఎగసిపడుతున్నాయి.దీంతో జపాన్ ప్రభుత్వం వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తర జపాన్ తీరప్రాంతాల అంతటా జాగ్రత్త సూచనలు అమల్లోకి వచ్చాయి. తూర్పు తీరాన్ని తీవ్రంగా కుదిపిన ఈ భూకంపం స్థానిక సమయంలో రాత్రి 9:13 గంటలకు నమోదైంది. ఇది 30 మైళ్లకు పైగా లోతులో కేంద్రీకృతమై ఉన్నట్లు సమాచారం. దీనివల్ల హొక్కైడో, అమోరి, ఇవాటే ప్రిఫెక్చర్ల పసిఫిక్ దీవులకు ముందస్తు హెచ్చరికలు ఇచ్చారు అధికారులు.అయితే, యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (%ఖూ+ూ%) ఈ భూకంప తీవ్రతను 7.6గా నమోదు చేసింది.

సాధారణంగా ఈ స్థాయి భూకంపాలు భవిష్యత్‌లో జరిగే మరింత పెద్ద కుదుపులకు సంకేతంగా చెప్పబడతాయి. ఇలాంటి భారీ భూకంపాలు సంభవించినప్పుడు పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం, భవనాల విధ్వంసం, ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.సునామీ ప్రభావం ఎంత భయంకరమై ఉంటుందో జపాన్‌కు చరిత్రే సాక్ష్యం. 2011 టోహెూకు భూకంపం%-%సునామీ ప్రపంచ చరిత్రలోనే అత్యంత దారుణమైన విపత్తులలో ఒకటి. ఆ విపత్తుతో దాదాపు 375 బిలియన్ డాలర్ల నష్టం, సుమారు 20 వేల మంది మరణం సంభవించినట్లు అంచనా. అదే సమయంలో జరిగిన ఫుకుషిమా అణు ప్రమాదం ప్రపంచ అణు ప్రమాదాల స్కేల్‌లో చెర్నోబిల్‌తో సమానమైన 7వ స్థాయి రేటింగ్ పొందింది.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 8 గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని, ఎన్నికల్లో విధులు నిర్వహిం చే ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సదు పాయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియంలో ప్రతీ ఓటు కీలకమని తెలిపారు. ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించు కోవాలని సూచించారు. ఫారం 14 దర ఖాస్తు చేసుకున్న వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలన్నారు. పోలింగ్ సమ యంలో లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలని ఉద్యోగులను ఆదేశించారు. కార్యక్రమం లో తహసీల్దార్ సుగుణ, ఎంపీడీవో విజయసింహారెడ్డి అధికారులు తదిత రులు పాల్గొన్నారు.



# సినిమా



## ఈ ఏడాది ఎక్కువ సినిమాలు చేసిన బ్యూటీ.

2024కు త్వరలోనే గుడ్ బై చెప్పనున్నాం. ఇక ఈ ఏడాది సినిమా ఇండస్ట్రీలో చాలా సంఘటనలు జరిగాయి. ఊహించని విధంగా కొంతమంది పెళ్లి చేసుకున్నారు. అలాగే ఇంకొంతమంది విడాకులు తీసుకున్నారు. ఇంకొంతమంది ప్రేమలో పడ్డారు. అదేవిధంగా మరికొంతమంది భామలు స్టార్ డమ్ కూడా తెచ్చుకున్నారు. ఇక కొంతమంది ఈ ఏడాది సినిమాలు చేయకుండా ఉండిపోయారు. మరికొంతమంది వరుస సినిమాలతో దూసుకుపోయారు. ఇక ఈ ఏడాది ఎక్కువ సినిమాలు చేసిన టాలీవుడ్ హీరోయిన్ ఎవరో తెలుసా.? ఆమె చేసిన సినిమాలన్నీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కానీ ఒక్క సినిమా కూడా విజయం సాధించలేదు అదే విశేషం.. ఇంతకూ ఆ హీరోయిన్ ఎవరో తెలుసా.?ఆమె పేరు ప్రస్తుతం టాలీవుడ్ లో మారు మ్రోగుతుంది. ఏ స్టార్ హీరో సినిమా చూసిన ఆమె కనిపిస్తుంది. అలాగే యంగ్ హీరోల సినిమాలకు కూడా ఆమె మొదటి ఛాయిస్ అవుతుంది. ఆమె ఎవరో కాదు లేటెస్ట్ సెన్సేషన్ శ్రీలీల. కన్నడ భాష నుంచి వచ్చిన ఈ తెలుగమ్మాయి.. తెలుగులో పెళ్ళిసందడి అనే సినిమాతో పరిచయం అయ్యింది. ఆతర్వాత రవితేజ ధమాకా సినిమాతో హిట్ అందుకుంది. ఇక తెలుగులో మహేష్ బాబులాంటి స్టార్ హీరోలతోనూ నటించింది. ఇటీవలే పుష్ప 2లో స్పెషల్ సాంగ్ లోనూ అదరగొట్టింది.ఇక ఈఏడాది తెలుగులో ఎక్కువ సినిమాలు చేసిన హీరోయిన్ గా నిలిచింది శ్రీలీల. రష్మిక మందన్న ఈ ఏడాది ఎక్కువ సినిమాలు చేసింది కానీ ఆమె తెలుగుతో పాటు హిందీలో కూడా నటించింది. కానీ తెలుగులో ఎక్కువ సినిమాలు చేసింది మాత్రం శ్రీలీలనే.. ఈ ఏడాది మొదట్లో రాబిన్‌హుడ్ అనే సినిమా చేసింది. నితిన్ హీరోగా నటించిన ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆతర్వాత జూనియర్ అనే సినిమా చేసింది. ఈ సినిమా కూడా ప్రేక్షకులను నిరాశపరిచింది. ఇక చివరిగా మాస్ జాతర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రవితేజ హీరోగా నటించిన మాస్ జాతర సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ప్రభావం చూపలేకపోయింది.





## మీ జీవక్రియ శక్తిని 10 రెట్లు పెంచే గ్రీన్ టీ.

ఉదయం ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వలన అప్రమత్తత పెరుగుతుందా? లేదా రాత్రి భోజనం తర్వాత తాగితే జీర్ణక్రియకు సహాయపడుతుందా? గ్రీన్ టీలోని కెఫిన్ మరియు కాటెచిన్స్ కలయిక జీవక్రియను పెంచడానికి, కొవ్వును తగ్గించడానికి సహాయపడుతుంది. అయితే, సరైన సమయంలో తాగడం ద్వారా దాని పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు. ఉదయం మరియు సాయంత్రం తీసుకున్నప్పుడు గ్రీన్ టీ యొక్క ప్రభావాలలో ప్రధాన తేడాలు ఏమిటో తెలుసుకుందాం.

3. గ్రీన్ టీ ప్రభావాలపై సమయం ఎలా ప్రభావం చూపుతుంది?

గ్రీన్ టీలో ఉండే కెఫిన్ మరియు ఎల్-థియానైన్ కలయిక జీవక్రియను పెంచడానికి, కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. అయితే, రోజులోని సమయాన్ని బట్టి దీని ప్రభావం మారుతుంది.

ఉదయం గ్రీన్ టీ తాగడం వలన కలిగే ప్రభావాలు:

కెఫిన్ మరియు ఎల్-థియానైన్ కలయిక వలన చురుకుదనం పెరుగుతుంది. రోజులోకి మారుతున్నప్పుడు సులభంగా దృష్టి కేంద్రీకరించడానికి ఇది సహాయపడుతుంది.

ఉదయం భోజనంతో పాటు తీసుకుంటే ఇన్సులిన్ పీక్ తగ్గే అవకాశం ఉంది.

సులభమైన జీర్ణక్రియ: సాధారణంగా జీర్ణవ్యవస్థ రోజులో ముందుగానే మరింత చురుకుగా ఉంటుంది కాబట్టి, జీర్ణక్రియ ప్రతిస్పందన సులభంగా ఉంటుంది.

చురుకైన పగటిపూట కొవ్వు ఆక్సీకరణ పై సహాయక ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

సాయంత్రం గ్రీన్ టీ తాగడం వలన కలిగే ప్రభావాలు:

ఇది కొందరికి ఆహ్లాదకరంగా, శాంతపరిచే ప్రభావం కలిగిస్తుంది.

సాయంత్రం భోజనం తర్వాత పోస్ట్-ప్రాండియల్ గ్లూకోజ్ తగ్గే అవకాశం ఉంది (వ్యక్తిగత జీవక్రియను బట్టి మారుతుంది).

రాత్రి భోజనం తర్వాత బద్ధకం లేదా ఉబ్బరం అనుభవించే వ్యక్తులకు ఓదార్పునిస్తుంది.

కెఫిన్ పట్ల సున్నితత్వం ఉన్నవారికి లేదా సక్రమంగా నిద్ర లేని వారికి నిద్రకు భంగం కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

4. ఉదయం సాయంత్రం గ్రీన్ టీ కీలక తేడాలు

గ్రీన్ టీ యొక్క విభిన్న ప్రభావాలు న్యూరోలాజికల్, జీవక్రియ మరియు జీర్ణక్రియ ప్రతిస్పందనల ఆధారంగా విభజించబడ్డాయి.

శక్తి ప్రతిస్పందన

కెఫిన్ %ూ%-థియానైన్ కలయిక ద్వారా అప్రమత్తత మానసిక దృష్టికి మద్దతు ఇస్తుంది.మొదట్లో ప్రశాంతంగా అనిపించవచ్చు, కానీ సున్నితత్వం ఉన్నవారిలో నిద్రకు అంతరాయం కలిగించవచ్చు.

జీవక్రియ ప్రభావాలుఅల్పాహారంతో తీసుకున్నప్పుడు గరిష్ట ఇన్సులిన్ ప్రతిస్పందనను తగ్గించవచ్చు.కొన్ని సందర్భాలలో భోజనం తర్వాత గ్లూకోజ్‌ను తగ్గించవచ్చు, ఇది వ్యక్తిగత జీవక్రియపై ఆధారపడి ఉంటుంది.

జీర్ణ సౌకర్యం..

జీర్ణవ్యవస్థ చురుకుగా ఉన్నందున జీర్ణక్రియ సులభం.

రాత్రి భోజనం తర్వాత బరువుగా అనిపిస్తే ఉపశమనం కలిగించవచ్చు.

కెఫిన్ ప్రమాదం..

కార్టిసాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు ఉదయం సులభంగా నిర్వహించబడుతుంది.

ఆలస్యంగా తీసుకుంటే ఆందోళన లేదా నిద్రకు భంగం కలిగించే అవకాశం ఎక్కువ.

మొత్తం అనుకూలత

స్థిరమైన ప్రయోజనాల కోసం క్రమబద్ధమైన ఉదయం అలవాటుగా బాగా పనిచేస్తుంది.

కెఫిన్ సున్నితత్వం తక్కువగా ఉంటే సాయంత్రం తీసుకోవడానికి అనుకూలం, కానీ నిద్రకు దగ్గరగా తీసుకోవడం మంచిది కాదు.

గ్లూకోజ్ స్థాయిలు

ఆహారంతో కలిపినప్పుడు సమతుల్య రక్త-గ్లూకోజ్ నమూనాలకు మద్దతు ఇస్తుంది.

భోజనం తర్వాత చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో సహాయపడుతుంది.

5. గ్రీన్ టీ తాగడానికి సరైన సమయం

మీ శరీర స్పందన, భోజనం సమయం, మరియు నిద్ర లయకు కెఫిన్ పట్ల మీ సున్నితత్వం ఆధారంగా గ్రీన్ టీ తాగడానికి సరైన సమయాన్ని నిర్ణయించుకోవాలి.

ఉత్తమ సమయం (ఉదయం): చాలా మందికి, ఉదయం తీసుకోవడం జీవక్రియ మరియు అభిజ్ఞా నమూనాలతో సహజంగా సరిపోతుంది. ఉదయం తీసుకోవడం నిద్రకు భంగం కలిగించే సంభావ్యతను కూడా తగ్గిస్తుంది.

సాయంత్రం తీసుకోవడం: మీరు తక్కువ కెఫిన్ లేదా పాక్షికంగా డీకెఫిన్ చేయబడిన రకాన్ని ఎంచుకుంటే, రాత్రి భోజనం తర్వాత ఒక వెచ్చని, తేలికపాటి పానీయాన్ని ఆస్వాదించాలనుకుంటే సాయంత్రం తీసుకోవచ్చు.

చిట్కా: మీరు నిద్రతో తరచుగా ఇబ్బంది పడుతుంటే, మీ గ్రీన్ టీ తీసుకునే సమయాన్ని రోజులో ముందుగా మార్చుకోవడం మంచిది. నిద్రవేళకు దగ్గరగా తీసుకోవడం నిద్రలేమి, అశాంతి లేదా నిద్రాభంగం ప్రమాదాన్ని పెంచుతుంది.

ముగింపు: స్థిరమైన జీవక్రియ మరియు అభిజ్ఞా ప్రయోజనాలను పొందాలనుకుంటే, నిద్రకు భంగం కలగకుండా చూసుకోవడానికి ఉదయం గ్రీన్ టీ తీసుకోవడం చాలా స్థిరమైన ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు.

6. గ్రీన్ టీని ఎలా తయారు చేయాలి ఎంత తీసుకోవాలి

తయారు చేసే విధానం:నీటిని పూర్తిగా మరిగించకుండా, సుమారు 70 నుండి 80 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేయాలి.ఒక కప్పు లేదా ఇన్ఫ్యూజర్‌లోకి ఒక టీస్పూన్ గ్రీన్ టీ ఆకులు లేదా ఒక టీ బ్యాగ్ వేయాలి.వేడి నీటిని టీపై పోసి, 2 నుండి 3 నిమిషాలు నానబెట్టాలి. మీరు ఎంత స్ట్రాంగ్‌గా ఇష్టపడతారో దాన్ని బట్టి సమయాన్ని సర్దుబాటు చేయవచ్చు.ఆకులను వడకట్టండి లేదా టీ బ్యాగ్‌ను తొలగించండి. బ్యాగ్‌ను గట్టిగా పిండవద్దు, అలా చేస్తే పానీయం రుచి చేదుగా మారుతుంది.

రోజుకి ఎంత తాగాలి?..రోజుకు 3-5 కప్పుల (సుమారు 240 మి.లీ చొప్పున) గ్రీన్ టీ తాగడం వలన గుండె జబ్బులు, మధుమేహం మరియు కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గించడం వంటి ఆరోగ్య ప్రయోజనాలు పెరుగుతాయి.ఈ మొత్తం సురక్షితమైన కెఫిన్ పరిమితులను (కప్పుకు 22-40 %ఎస్త్ర%) మించకుండా యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. 8 కప్పులకు మించి తాగడం వలన నిద్రలేమి వంటి దుష్ప్రభావాలు కలగవచ్చుబీ కెఫిన్ సున్నితత్వం ఆధారంగా సర్దుబాటు చేసుకోవాలి.

## తొలి టీ20లో భారత్ గెలవాలంటే రవిచంద్రన్ అశ్విన్ సూచించిన ఐదుగురు ఆటగాళ్లు ఈ విధంగా..!

సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్ కోసం టీమిండియా సిద్ధమైంది. ఈ సిరీస్ తొలి మ్యాచ్ మంగళవారం కటక్ వేదికలో జరుగుతుంది. ఇరు జట్లు పూర్తిగా సిద్ధమై ఉన్నాయి.ఈ సిరీస్‌లో భారత్ కాంబినేషన్‌పై రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన అభిప్రాయం ప్రకారం, టీ20 ప్రపంచకప్ 2026 కోసం సరైన జట్టును ఈ సిరీస్‌లోనే సెట్ చేసుకోవాలి. సౌతాఫ్రికాతో విజయం సాధించాలంటే ఐదుగురు కీలక ఆటగాళ్లను తుది జట్టులో తప్పక ఆడించాలి అని అశ్విన్ సూచించారు.“శుభ్‌మన్ గిల్ రీఎంట్రీతో సంజూ శాంసన్ మూడో స్థానంలో ఆడుతాడా? ఇది ఇంకా సందేహంగా ఉంది. ఫస్ట్ డౌన్‌లో సూర్య లేదా తిలక్ వర్మను ఆడించవచ్చు. సంజూను మూడో స్థానంలో ఆడించాలి, కానీ శుభ్‌మన్ గిల్ రాకతో అతనికి అవకాశాలు తక్కువయ్యాయి. గతంలో ఓపెనర్ కమ్ కీపర్‌గా రాణించిన సంజూ జట్టులో స్థానం పొందడంలో సమస్య ఎదుర్కొన్నాడు,” అని అశ్విన్ పేర్కొన్నారు.అతను చెప్పినట్లుగా, ఓపెనర్‌గా గిల్ ప్రవేశంతో, మిడిలార్డర్‌లో ఆడే వికెట్ కీపర్ కమ్ ఫినిషర్ భారత జట్టుకు అవసరం. ఈ సిరీస్ ద్వారా భారత బ్యాటింగ్ లైనప్ స్పష్టత పొందుతుందని అశ్విన్ భావిస్తున్నారు. మరోవైపు, సౌతాఫ్రికా జట్టులో పెద్ద ప్రమాదకర ఆటగాళ్లు లేరు. కుల్దీప్, వరుణ్, బుమ్రా వంటి స్టార్ బౌలర్లు ఆ జట్టులో లేరు.భారత్‌కు కూడా ఈ సిరీస్ కీలకమైనది. టీమ్ కాంబినేషన్‌ని నిర్ణయించుకోవాలి. ఇప్పటికే కొంతమేర ప్రయోగాలు జరిగాయి. టీ20 జట్టులో స్థిరత్వం ముఖ్యమైన అంశం. అర్ష్‌దీప్ సింగ్ జట్టులో కొనసాగించాలా లేదా అనేది కూడా తేల్చుకోవాల్సిన ప్రశ్న. అశ్విన్ అభిప్రాయం ప్రకారం, అతన్ని ఆడించాలి. వరుణ్, కుల్దీప్ ఇద్దరినీ కలిసి ఆడించగలమో చూడాలి. అవసరమైతే మూడో పేసర్‌ను చేర్చాలి. లేకపోతే బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యా కాంబినేషన్ మంచి ప్రభావం చూపుతుందని అశ్విన్ చెప్పారు.అశ్విన్ మాట్లాడుతూ, ఈ బౌలింగ్ లైన్ ద్వారా ప్రత్యర్థి స్కోర్‌ను సరిగా ఆల్‌ఔట్ చేయగల సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. తొలి మ్యాచ్‌లో ఈ బౌలింగ్ లైన్‌ను చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అశ్విన్ తెలిపారు. అంతే కాకుండా, వరుణ్ చక్రవర్తి యొక్క అసలు టాలెంట్‌ను టీ20 ప్రపంచకప్ వరకు రహస్యంగా ఉంచడం మంచిదని సూచించారు.




## గిల్‌కు స్వీట్ వార్నింగ్ ఇచ్చిన ఇర్ఫాన్ పఠాన్

భారత్, సౌతాఫ్రికా టీ20 సిరీస్‌కు మంగళవారం నుంచి తెరలేవనుంది. తొలి మ్యాచ్ కటక్ వేదికగా రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. వన్డే సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న టీమిండియా.. ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఇక గాయం నుంచి కోలుకున్న శుభ్‌మన్ గిల్ , హార్దిక్ పాండ్యా.. ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్.. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కీలక సూచన చేశాడు.

మెడనొప్పితో దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు, వన్డే సిరీస్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్.. టీ20 సిరీస్ ఆడనున్నాడు. ఇటీవల బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న అతడు.. జోరుగా ప్రాక్టీస్ ప్రారంభించాడు. ఇలాంటి సమయంలో రీఎంట్రీ ఇస్తున్న గిల్.. టీ20 ప్రపంచకప్ 2026 ముందు జట్టులో సుస్థిర స్థానంలో సంపాదించాలంటే ఈ సిరీస్‌లో తప్పకుండా రాణించాలని పఠాన్ సూచించాడు. లేకపోతే.. జట్టులో చోటు కష్టమని హెచ్చరించాడు.

“వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టీ20 ఫార్మాట్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అతడు మూడు ఫార్మాట్లు ఆడే సత్తా ఉన్న ఆటగాడు. టీ20ల్లో అతడి సామర్థ్యం ఏంటో ఐపీఎల్‌లో మనమంతా చూశాం. తనను తాను నిరూపించుకునేందుకు సౌతాఫ్రికాతో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ గిల్‌కు మంచి ఛాన్స్. అయితే శుభ్‌మన్‌పై కొంత ఒత్తిడి ఉంటుంది. కానీ అతడు దాన్ని అధిగమించగలడు. ఈ సిరీస్‌లో అతడు రాణిస్తాడని ఆశిస్తున్నా” అని ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యానించాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా కటక్ వేదికగా మంగళవారం రాత్రి 7 గంటలకు తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది.

భారత్, దక్షిణాఫ్రికా టీ20 సిరీస్ షెడ్యూల్

తొలి టీ20: డిసెంబర్ 09 - కటక్

రెండో టీ20: డిసెంబర్ 11 - ముల్లాన్‌పూర్

మూడో టీ20: డిసెంబర్ 14 - ధర్మశాల

నాలుగో టీ20: డిసెంబర్ 17 - లక్నో

ఐదో టీ20: డిసెంబర్ 19 - అహ్మదాబాద్




Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..